





గద, నాగలితో పవన్ కల్యాణ్, చంద్రబాబు

వేదికపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ అభివాదం

గూడెంలో ఉమ్మడి సభ

సూపర్ హిట్

రాష్ట్ర భవిష్యత్ కోసమే కలిశాం


ఆశీర్వదించండి.. గెలిపించండి

- ఉమ్మడి వేదికపై చంద్రబాబు, పవన్ పిలుపు
- సభ భావోద్వేగాలు.. అభిమానుల కేరింతలు
- దూర ప్రాంతాల నుంచి భారీగా రాక
- ఎన్నికల ముందే టీడీపీ-జనసేన శ్రేణులకు అధినేతల దిశా నిర్దేశం

తాడేపల్లిగూడెం/ఏలూరు/భీమవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 'టీడీపీ-జనసేన పొత్తు తాడేపల్లి ప్యాలెస్‌ను కకావికలం చేస్తోంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం, వివిధ వర్గాల భవిష్యత్తు కోసం మేం కలిశాం. మమ్మల్ని ఆశీర్వదించండి.. గెలిపించండి' అంటూ టీడీపీ-జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అత్యంత ఉద్వేగంతో వైసీపీ పైకి వారు సవాళ్లు విసిరారు. ఇది నిజమా..? కాదా ? అంటూ సభికుల నుంచి సమాధానాలు రాబట్టిన ప్రసంగాలు సాగిన తీరు అందరిని హత్తుకుంది. 'తెలుగు జన విజయ కేతనం జెండా' పేరిట పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడు వద్ద బుధవారం సాయంత్రం నాలుగున్నరకు మొదలైన భారీ బహిరంగ సభ రాత్రి ఎనిమిది గంటల వరకు సాగింది. టీడీపీ-జనసేన ఎన్నికల పొత్తులో భాగంగా ఇటీవల 99 మంది పోటీ చేసే అభ్యర్థులతో తొలి జాబితాను ఇరు పార్టీలు ప్రకటించాయి. దీని తర్వాత ప్రజలకు ఉమ్మడి సంకేతం ఇచ్చేందుకు సాగిన సభకు తొలిసారిగా అధినేతలు ఇద్దరు ఒకే వేదిక పైకి వచ్చారు. ఇది అటు పవన్ అభిమానులకు, ఇటు చంద్రబాబు కేడర్‌కు పండుగగా మారింది. ఇరువురు నేతలు పరస్పర ఆలింగనాలు సభికులకు మరింత కనువిందు చేసింది. ప్రత్యేకించి పొత్తు ఆ తదుపరి అభ్యర్థుల ప్రకటన తర్వాత ఎంతో క్రమశిక్షణతో నేతలు ఇద్దరు ఉమ్మడిగా జరిగిన సభలో అందరి మనసులు దోచారు. చంద్రబాబు సైతం సుమారు 50 నిమిషాలపాటు ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఎన్నికల ముందు ముద్దులు.. గెలిచాక మీడియాతో సహా అందరిపైన పిడిగుద్దులా అంటున్నపుడు సభికులు అవును అవునంటూ తెలిపారు.

రెండు కలిసే నడుస్తున్నాయి : చంద్రబాబు

'ప్రజలకు రోషం ఉందా.. మాకైతే రోషం ఉంది. ఒక సీనియర్‌గా జరుగుతున్నందంతా చూస్తూ ఊరుకోలేను. ప్రశ్నించే గుణం ఉన్నా పవన్ సైతం మౌనంగా ఉండలేదు. జనం కోరుకునే వెలుగు మీకు ఇచ్చే బాధ్యత మాది' అంటూ చంద్రబాబు భరోసా ఇవ్వడం అందరిని సంతృప్తి పరిచింది. రాష్ట్ర విభజన అంశాలు ప్రజలకు గుర్తు చేస్తూ అప్పట్లో జరిగిన నష్టాన్ని ఎత్తి చూపాం. ఇప్పటికి అదే ధోరణిలో రాష్ట్రాభివృద్ధికి అనువుగానే జనసేన టీడీపీ లక్ష్యాల తీరు ఉందని చంద్రబాబు ప్రజలకు పదే పదే వివరించారు. ప్రజల కోసం కన్న కలల సౌధాన్ని జగన్ వచ్చి నాశనం చేశాడు. పొత్తు ఎందుకని ఆలోచిస్తే అందరికి అవగాహన వస్తుంది. ఆఖరికి అంతర్జాతీయ క్రికెటర్ విహారిని రాష్ట్రం నుంచి పారిపోయేలా చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే అంటూ గుర్తు చేసినప్పుడు షేమ్ షేమ్ అంటూ సభికులు ప్రతిస్పందించారు. రాష్ట్రంలో కులాల మధ్య ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించి సర్వనాశనం చేయాలని, ఆ దిశగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. కాని, నేను, పవన్ రాష్ట్రాన్ని నెంబర్-1 చేయాలనుకుంటున్నాం. సినిమా టిక్కెట్లలోను రాజకీయాలు చేయడం ఎంత వరకు సబబు. ఇది భావ్యమా' అంటూ ప్రశ్నించి సభికుల నుంచి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. వచ్చే ఎన్నికల్లో మన గెలుపును ఎవరూ ఆపలేరని, బాధ్యత కలిగిన అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేశామని మాఫియా నేతలు కావాలా.. మంచి నేతలు కావాలంటూ ప్రజలను ప్రశ్నించారు. ఉద్యోగుల అంశాలను ప్రస్తావిస్తూ ఇప్పుడున్న ప్రభుత్వం ఉద్యోగులపై ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏం చేయబోతున్నామో త్వరలోనే ప్రకటిస్తామన్నారు. కిందిస్థాయి కేడర్‌లో ఉన్న భావాలను స్పృశిస్తూ ..ఇగోలకు పోవద్దు.. ఒక పార్టీ వెనుక ఇంకో పార్టీ నడుస్తున్నట్టు భావిస్తారు. ఇదంతా కాదు రెండు పార్టీలు కలిసి నడుస్తాయని భావించాలని, అనుభవంతో చెబుతున్నానని చంద్రబాబు ప్రకటించిపుడు టీడీపీ-జనసేన కేడర్ సంతృప్తితో కేరింతలు కొట్టారు. టీడీపీ కేడర్ ఎంపిక తీరుపై అక్కడక్కడ అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా పరోక్షంగా ప్రస్తావిస్తూ అందరికి తగిన న్యాయం చేయడం సాధ్యం కాదని, అవకాశాలను బట్టి అందరికి ఆమోదయోగ్యంగా న్యాయం చేస్తామన్నారు. పవన్ కల్యాణ్ కూడా కాస్తంత ఉత్తేజభరితంగానే మాట్లాడుతూ కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు. ఇంతకు ముందు జరిగిన తన ఓటమిని గుర్తు చేసుకున్నారు. పొత్తులో జనసేన ఎన్ని సీట్లు తీసుకోవాలి.. సీఎం పదవిని ఎలా పంచుకోవాలి అంటూ లేఖలతో సలహాలు ఇచ్చిన వారందరికి నర్మగర్భంగా మాట్లాడుతూ చెక్ పెట్టారు. ఆయన ఏమన్నారంటే.. 'నాకు ఎవరి సలహాలు అక్కరలేదు. జిల్లా నుంచి ఇటీవల సలహాలు ఇస్తూ బహిరంగ లేఖలు రాస్తున్నారు. కొందరు సీనియర్ల లేఖలు పొత్తుపై ప్రభావం చూపుతున్నాయి. ఒంటరిగా పోటీ చేసే శక్తి ఇప్పటికిప్పుడు జనసేనకు లేదు. నాపై విమర్శలు చేసే వారు ముందుగా దీనిపై ఆలోచించాలి. జగన్ వెనుక ఉన్న సమూహాలు మాత్రం తప్పు చేసినా దోపిడీ చేసినా ఆహా.. ఓహో అంటూ ఉన్నారు. వెనకేసుకొస్తున్నారు. కాని, సామాన్యుడు రాజకీయం చేస్తే ఇలాగే ఉంటుందని నిరూపిస్తా. ఎవరికి ఎంత ఓపికో పరీక్షించుకోవాలి. నాతో నిలబడి.. నా వెంట నడిచేవారే నా వాడు'.. అంటూ పవన్ ఉద్వేగంగా మాట్లాడటంతో సభికుల నుంచి స్పందన లభించింది. ప్రత్యేకించి సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబు, నేను రాష్ట్రం కోసమే కలిసి పని చేస్తామంటూ స్పష్టం చేశారు.



సభలో ప్రసంగిస్తున్న పవన్ కల్యాణ్



వేదికపై చంద్రబాబు, పవన్ కల్యాణ్, బాలకృష్ణ తదితరులు



సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు



సభలో టీడీపీ నాయకులు

అందరి చూపు వేదిక మీదే..

ఓ వైపు సభా సమయం రాత్రి గడుస్తున్నా అందరిచూపు వేదిక మీదే వుంది. టీడీపీ-జనసేన రాష్ట్ర నియోజకవర్గ నేతలు ఆశీనులు కావడమే నిదర్శనం. ఏ ఒక్క పార్టీ తక్కువ కాదని అంతా సమానమేని అన్నట్టుగా వేదికపైన మొత్తం 500 మంది కూర్చోగా రెండు పార్టీల నేతలకు చెరి సగం అన్నట్టుగానే సభా వేదిక ఏర్పాటు చేశారు. ఒక వైపు టీడీపీ జెండా, మరో వైపు జనసేన జెండా ఉండేలా ఈ పతకాల కిందే ఇరు పార్టీలు నేతలు ఆశీనులయ్యారు. ప్రత్యేకించి జనసేనలో కొత్తగా చేరిన కొత్తపల్లి సుబ్బారావు, కొణతాల రామకృష్ణ వంటి సీనియర్ నేతలు సైతం కొద్దిసేపు ప్రసంగించారు. రామకృష్ణ అయితే జనసేన టీడీపీ మాదిరిగానే ఈ రెండింటితో బీజేపీ కలిసి వచ్చేలా చూడాలని కోరడం మరో విశేషం. పవన్ తమ ప్రసంగం ఆఖరిలో బీజేపీకి జై అంటూ ముగించారు. టీడీపీ పక్షాన వేదిక ముందు భాగంలో చంద్రబాబుతోపాటు అచ్చెన్నాయుడు, బాలకృష్ణ, సీతారామలక్ష్మి, పితాని సత్యనారాయణ, వలవల బాబ్జి, రఘురామకృష్ణంరాజు కూర్చుండగా పవన్ పక్కన నాదెండ్ల మనోహర్, కొణతాల రామకృష్ణ, కొటికలపూడి గోవిందరాజు, కందుల దుర్గేష్, బొలిశెట్టి శ్రీనివాస్ ఉన్నారు. టీడీపీలో సీనియర్ నేతలు బుచ్చియ్యచౌదరి, చినరాజప్పతో పాటు కొలుసు పార్థ సారథి, చింతమనేని ప్రభాకర్, ముళ్లపూడి బాపిరాజు, కంభంపాటి రామ్మోహన్, నిమ్మల రామానాయుడు, పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత పాల్గొన్నారు.

జనమే జనం

రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున జనం తరలి వచ్చారు. ఇరు పార్టీల అగ్రనేతలు ఒకే వేదిక పైకి రావడంతో ఈ వేదికకు రాజకీయ ప్రాధాన్యం పెరిగింది. దీంతో వివిధ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నేతలు తరలి వచ్చారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, పవన్ వేదిక పైకి రాక ముందే పలువురు సీనియర్లు ప్రసంగించారు. నిమ్మల రామానాయుడు, రఘురామకృష్ణంరాజు, బాలకృష్ణ, వలవల బాబ్జి, దుర్గేష్, కొత్తపల్లి సుబ్బారాయుడు వంటి వారు మాట్లాడడంతో జనం కేరింతలతో సభ దద్దరిల్లింది. రఘురామకృష్ణంరాజు సెటైర్లు వేస్తున్నపుడు వేదికపై ఉన్న పవన్, చంద్రబాబు ముసిముసి నవ్వులు చిందించారు. తాను వచ్చే ఎన్నికల్లో నరసాపురం నుంచి పోటీ చేస్తానని రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యానించిపుడు సభలో కేరింతలు వినిపించాయి.

అభిమానుల జోష్

తెలుగుదేశం-జనసేన ఉమ్మడి సభలో అభిమానుల జోష్ అంతా ఇంతా కాదు. కార్యకర్తలను, అభిమానులను అడ్డుకోవడం పోలీసులు తరం కాలేదు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను వీక్షించేందుకు ఫ్లడ్‌లైట్ స్తంభాలను ఎక్కేశారు. మహిళలు అందుకు పోటీ పడ్డారు. పసుపు చీరలు ధరించి వేలాదిగా మహిళలు సభకు తరలి వచ్చారు.



సభలో జనసేన నాయకులు



కొవ్వూరులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

కొవ్వూరులో కలెక్టర్ పలు పోలింగ్ కేంద్రాల పరిశీలన

కొవ్వూరు, ఫిబ్రవరి28: గత ఎన్నికలకంటే పోలింగ్ శాతం పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. మాధవీలత అన్నారు. కొవ్వూరు పట్టణంలోని సంస్కృత కళాశాల, సంస్కృత ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో ఉన్న 82, 83, 86, 89 పోలింగ్ కేంద్రాలను అధికారులతో కలిసి బుధవారం కలెక్టర్ పరిశీలించారు. అనంతరం బీఎల్వోలు, సెక్టోరల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో 86.41 శాతం పోలింగ్ నమోదైందన్నారు. నియోజకవర్గ సగటుకంటే తక్కువ పోలింగ్ నమోదైన వివరాలు పీఎస్‌ల వారీగా అందుబాటులో ఉన్నాయన్నారు. గతంలో తక్కువ పోలింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాల వద్ద స్వీప్ కార్యకలాపాలతోపాటు రాజకీయ పార్టీలతో కలిసి ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను చేపట్టాలన్నారు. నియోజకవర్గ సగటు ఓటరు నమోదు 86.41 శాతంకంటే తక్కువ 69.12 శాతం నుంచి 76.97 శాతం నమోదైన పీఎస్‌ల బీఎల్వోలతో కలెక్టర్ సమీక్షించారు. ఓటర్లలో ఓటుహక్కుపై చైతన్యం తీసుకురావడం కోసం తగిన ప్రణాళికలు, కార్యాచరణ సిద్ధం చేయాలని ఆర్వోని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులను కలుపుకుని వెళ్లి ఓటింగ్ శాతం పెరిగేలా బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి చైతన్యం తీసుకురావడానికి సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, తహశీల్దార్ కె.మస్తాన్, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.



అలంకార ప్రాయంగా కొన్ని కంపెనీల డెస్కులు.. బయోడేటాల స్వీకరణ తంతు.. భోజనాల దగ్గర ఒకటే స్టంట్లు

ఆశగా వచ్చి.. 'నిరాశతో వెనుదిరిగి'

- జాబ్‌మేళాతో వంచన
- ఉసూరుమన్న నిరుద్యోగులు
- బయోడేటా తీసుకొని వెళ్లమన్న కంపెనీలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): '2022లో బీటెక్ పూర్తయ్యింది. 2023లో ఇంటర్న్‌షిప్ పూర్తిచేశాను. ఐదేళ్ల నుంచీ ఒక్క నోటిఫికేషనూ లేదు. జాబ్‌మేళాలకు వెళ్తున్నాను. అలాగే ఇక్కడికి వచ్చాను. బయోడేటా తీసుకున్నారు. తర్వాత ఫోన్ చేస్తామన్నారు. నేను చదివింది బీటెక్. వాళ్లు ఇచ్చే జీతం పదివేలట. ప్చ్.. యువత బతుకు ఇదీ!'.. శ్రీను అనే ఓ అభ్యర్థి ఆవేదన. 'నేను అన్ని కంపెనీలకూ నా రెస్యూమ్ ఇచ్చేశాను. తర్వాత ఫోన్ చేస్తానన్నారు. ఆ ఫోన్ కోసం ఎదురుచూడడమే.. వస్తుందో రాదో అనుమానమే!'.. లక్ష్మీ అనే ఓ విద్యార్థిని నిర్వేదం. రాజమహేంద్రవరంలోని మార్గాని ఎస్టేట్స్‌లో ఏర్పాటుచేసిన మెగా జాబ్ మేళాకు వచ్చిన ఆ అభ్యర్థుల అభిప్రాయాలివి. నిరుద్యోగులను వైసీపీ ప్రభుత్వం ఓ తీరున మోసం చేస్తుంటే.. వైసీపీ ప్రజాప్రతినిధులు 'తామేమి తక్కువ తిన్నామా' అనుకుంటూ నిరుద్యోగ యువత భవితవ్యాలతో ఆటలాడుకుంటున్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించిన జాబ్ మేళాను ఎంపీ భరత్‌రామ్ నిస్సిగ్గుగా తమ రాజకీయ ప్రచారానికి వాడుకొన్నారు. ఆశతో వచ్చిన యువత ఉసూరుమంటూ ఇంటిదారి పట్టారు. సీఎం జగన్ ఐదేళ్ల నుంచీ ప్రభుత్వ ఉద్యోగాలకు ఒక్క నోటిఫికేషనూ ఇవ్వలేదు. పాలనాకాలం ముగుస్తుందనగా హడావుడిగా మెగా డీఎస్సీ అంటూ 30 వేల ఖాళీలకుగాను 6 వేల ఉద్యోగాలతో ఓ నోటిఫికేషన్ తీసుకొచ్చారు. అది దగా డీఎస్సీ అనే ఆరోపణలు బహిరంగంగానే పెద్దఎత్తున వ్యక్తమవుతున్నాయి. జగన్ దారిలోనే నడుస్తున్న వైసీపీ ప్రజాప్రతినిధులు కూడా నిరుద్యోగుల మనోభావాలతో ఆడుకుంటున్నారు. మెగా జాబ్ మేళాలంటూ ప్రచారంతో ఊదరగొడుతున్నారు. వాస్తవానికి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈ మేళాలను నిర్వహిస్తోంది. రాజకీయ మైలేజీ కోసం ఎంపీ భరత్ వీటినీ వదల్లేదు. బుధవారం మెగా జాబ్ మేళా పేరుతో ఓ జాతర నిర్వహించారు. 100కి పైగా కంపెనీలు ఉద్యోగాలు ఇచ్చేస్తాయని ప్రచారం ఊదరగొట్టారు. దీంతో రాజమహేంద్రవరంతోపాటు కాకినాడ, అమలాపురం, తణుకు తదితర ప్రాంతాల నుంచి యువత ఆశగా వచ్చారు. టెంట్లు వేసి ఒక్కో గదిలో మూడు నాలుగు సంస్థల ప్రతినిధులు కూర్చున్నారు. అభ్యర్థులను ఏవో నాలుగు ప్రశ్నలు అడిగి రెస్యూమ్ తీసుకొని సాగనంపారు. ఒకవేళ తాము పిలిచినా మూడు దశల్లో ఇంటర్వ్యూ జరుగుతుందని, అవన్నీ ఉత్తీర్ణత సాధిస్తే శిక్షణ ఇస్తామని తర్వాతే జాబ్ ఉంటుందని చెప్పి పంపేశారు. జాబ్‌లు ఇస్తామంటూ వచ్చిన కంపెనీల్లో ఒకట్రెండు మినహా మిగతావన్నీ చిన్నాచితకా కంపెనీలని తెలుస్తోంది. ఓ సంస్థ డ్రైవరు ఉద్యోగానికి కూడా జాబ్ మేళాను ఆశ్రయించడం ఆశ్చర్యపరిచింది. మరోవైపు ఉద్యోగ జాతరకు వచ్చిన అభ్యర్థులతో సభ ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా ఎంపీ భరత్ విచ్చేశారు. తాము నగరానికి చేసిన మేలు అంతా ఇంతా కాదు ఎంతో.. అంటూ ఉపన్యాసం ఇచ్చారు. మిగతా వారూ ఎంపీని పొగడ్తలతో ముంచెత్తారు. మేళా ప్రవేశ ద్వారం వద్ద వచ్చేవారికి ఎంపీ బొమ్మతో ముద్రించిన కరపత్రాలను తెగ పంచేశారు. భోజన ఏర్పాట్లు చేశామని చెప్పినా సరైన పద్ధతి లేక అభ్యర్థులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు.

పకడ్బందీగా పది పరీక్షలు : డీఆర్వో

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 18 నుంచి 30 వరకూ జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో నరసింహులు ఆదేశించారు. సంబంధిత అధికారులతో ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 30,116 మంది విద్యార్థులకు 137 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులను 8.45 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద అత్యవసర మందులు అందుబాటులో ఉంటాయని, తాగునీటి సదుపాయం ఉంటుందన్నారు. దివ్యాంగులు స్క్రయిబ్‌ని ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ అనీల్‌కుమార్, డీఈవో వాసుదేవరావు, డీటీవో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో సూచనలిస్తున్న డీఆర్వో నరసింహులు



రైతుభరోసా చెక్కును విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్, జేసీ

రైతు భరోసా నిధులు విడుదల

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 28: వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ పథకం కింద జిల్లాలో 1,41,216 మంది రైతులకు రూ.28.39 కోట్లు, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సున్నావడ్డీ రాయితీ కింద 30,714 మంది రైతులకు రూ.5.86 కోట్లు రైతుల ఖాతాలకు జమ అయినట్టు కలెక్టర్ డాక్టర్ మాధవీలత తెలిపారు. బుధవారం రైతుభరోసా, పీఎం కిసాన్ పథకం వడ్డీ రాయితీ, సున్నా వడ్డీ పంట రుణాల పథకం కింద సీఎం కార్యాలయంలో ఆర్థిక సాయాన్ని వర్చువల్ విధానం ద్వారా సీఎం జగన్ రైతుల ఖాతాలకు జమచేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, రైతులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తంచేస్తున్న బోటు కార్మికులు

డ్రెడ్జింగ్ వ్యతిరేకిస్తూ ధర్నా

రాజమహేంద్రవరం రూరల్/సిటీ, ఫిబ్రవరి 28 : రాజమహేంద్రవరం గాయత్రి ఇసుక ర్యాంప్‌లలో పట్టపగలే ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి అతి సమీపంలో గోదావరి గర్భాన్ని చీల్చి ఇసుకను డ్రెడ్జింగ్ చేస్తున్నారు. బుధవారం ఉదయం ఈ ర్యాంప్‌లలో డ్రెడ్జింగ్ పనులను ఇసుకతీత కార్మికులు అడ్డుకున్నారు. డ్రెడ్జింగ్ వల్ల సుమారు 3 వేల మంది కార్మికులకు పనులు లేకుండా పోయాయని వారంతా ఆందోళనకు దిగారు. లేబర్ యూనియన్ అధ్యక్షుడు వెంకట్రావు, శ్రీను, సునీల్, అప్పన్న, పోతురాజు, ప్రసాద్, కిరణ్, వెంకటేశ్వరావు, వంశీలు నిరసన ధర్నా చేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అయితే అప్పటివరకు పోలీసులుగాని, అధికారులుగాని డ్రెడ్జింగ్‌ను గాలికి వదిలేసి.. ఆందోళన చేస్తున్న కార్మికులను అడ్డుకోవడానికి రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అధికారులు కళ్లు తెరిచి డ్రెడ్జింగ్ ద్వారా ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. డ్రెడ్జింగ్ తవ్వకాలు తాత్కాలికంగా నిలుపుదల చేయడంతో ఆందోళన విరమించారు.

జెండా జోష్


వేదికపై జనసేన పార్టీ నాయకులు




ఒళ్ళంతా జెండాలతో..


దాహం తీర్చేందుకు చల్లని మజ్జిగ




అన్న ఎన్టీఆర్


తెలుగుదేశం పార్టీ నాయకులు


ఫ్లడ్‌లైట్, ఫ్లెక్సీ స్తంభాలపై అభిమానులు

పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్తిపాడులో బుధవారం జరిగిన టీడీపీ-జనసేన ఉమ్మడి సభకు జనం పోటెత్తారు.. చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్‌లు తమ ప్రసంగాలతో ఇరుపార్టీల కార్యకర్తల్లో జోష్ నింపారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు, కృష్ణా, గుంటూరు, విశాఖ జిల్లాల నుంచి కార్యకర్తలు, అభిమానులు సభకు హాజరయ్యారు.


వయసు పైబడినా తగ్గేదేలే..


ఊరేగింపుగా రెక్కలు విరిగిన ఫ్యాన్


తెలుగు మహిళల సందడి


తాడేపల్లిగూడెం నుంచి జనసేన ర్యాలీ




వేదిక ముందు యువత ఉత్సాహం

వివాహేతర సంబంధం అనుమానంతో దాడి

ఎదురింటి వ్యక్తిపై కత్తితో దాడిచేసిన ఎంపీటీసీ

తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చేరిక

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 28: తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడనే అనుమానంతో ఇంటి ఎదురుగా ఉన్న వ్యక్తిపై ఎంపీటీసీ పదునైన కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. అమలాపురం పట్టణ సీఐ కె.క్రిస్టఫర్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఈదరపల్లి రామాలయం వీధిలో ఎంపీటీసీ అడపా సత్తిబాబు కుటుంబం అద్దెకు ఉంటోంది. అతడి ఇంటికి ఎదురుగా ఉన్న ఇంట్లో కొత్తపల్లి సుబ్రహ్మణ్యం (48) కుటుంబం కొన్నేళ్లుగా నివాసం ఉంటోంది. కొత్తపేట పలివెల నుంచి వచ్చిన సుబ్రహ్మణ్యం అమలాపురం, పరిసర ప్రాంతాల్లో చిన్న చిన్న కాంట్రాక్టు పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తన భార్యతో అతడికి వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతో బుధవారం మధ్యాహ్నం సత్తిబాబు ఎదురింట్లో ఉన్న సుబ్రహ్మణ్యంపై కత్తితో ఒక్కసారిగా దాడి చేశాడు. కత్తిపోట్లకు చెయ్యి అడ్డు పెట్టడంతో రెండు చేతులతో పాటు మెడ వద్ద తీవ్ర గాయాలయ్యాయి. హత్యాయత్నం జరిగిన సమయంలో సుబ్రహ్మణ్యం భార్య దేవాలయానికి వెళ్లింది. అక్కడ పూజాధికాలు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చేసరికి రక్తపు మడుగులో పడి ఉన్న భర్తను చూసి వెంటనే స్థానికులతో కలిసి 108 అంబులెన్సు వాహనానికి సమాచారం అందించారు. వాహనం రావడంలో జాప్యం జరగడంతో భర్తను తీసుకుని అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లింది. హత్యాయత్నానికి పాల్పడ్డ సత్తిబాబు తాను వినియోగించిన కత్తితో పట్టణ పోలీసులకు లొంగిపోయినట్టు తెలిసింది. సమాచారం అందుకున్న అమలాపురం డీఎస్పీ ఉమామహేశ్వరరావు, పట్టణ సీఐ కె.క్రిస్టఫర్ సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. తీవ్రంగా గాయపడ్డ సుబ్రహ్మణ్యం ఆరోగ్య పరిస్థితి మెరుగ్గానే ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

అంజి డెయిరీపై కేసులు

పెద్దాపురం, ఫిబ్రవరి 28: పెద్దాపురం మండలంలోని జి.రాగంపేట గ్రామంలో ఉన్న అంజి డెయిరీలో కల్తీ నెయ్యి తయారు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఫుడ్ సేఫ్టీ, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా బుధవారం దాడులు చేశారు. రీజినల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు అధికారులు ఈ దాడులు నిర్వహించారు. 648 కిలోల పామాయిల్, 216 కిలోల నెయ్యి స్వాధీనం చేసుకున్నారు లీగల్ మెట్రాలజీ అధికారులు మూడు కేసులు నమోదు చేశారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు డెయిరీ యజమాని పిల్లి రవికిరణ్‌కు నోటీసులు జారీ చేశారు.

సక్రమంగా ఓటు హక్కు వినియోగించడం

ఓ సామాజిక బాధ్యత

చక్కటి చట్టసభలు ఏర్పడితే జవాబుదారీతనం ఉంటుంది

ప్రజా సంక్షేమానికి తోడ్పడేవారిని ఎన్నుకోవాలి

రాష్ట్ర ఎన్నికల సంఘం విశ్రాంత ప్రధానాధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్


కార్యక్రమంలో మాట్లాడుతున్న నిమ్మగడ్డ రమేశ్‌కుమార్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటు హక్కు సక్రమంగా వినియోగించడం ఓ సామాజిక బాధ్యతని రాజ్యాంగం నిర్దేశించిందని విశ్రాంత రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ చెప్పారు. ఓటు హక్కును వినియోగించుకునే అంశంపై ఓటర్లను చైతన్యం చేసే ఉద్దేశంతో సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ ఆధ్వర్యంలో బుధవారం రాజమహేంద్రవరంలో 'కళాజాత'ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విచక్షణ, వివేచనతో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎవరైతే ప్రజా సంక్షేమానికి తోడ్పడతారో వారిని ఎన్నికోవడం వల్ల చక్కటి చట్ట సభలు ఏర్పడతాయని.. దాంతో జవాబుదారీతనం ఉంటుందన్నారు. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏపీ ల్యాండ్ టైటిల్ యాక్టు తీసుకొచ్చిందన్నారు. ఈ చట్టం దారుణమైందని, ఇలా ప్రజలకు ఉపయోగపడని చట్టాలకు ప్రజాస్వామ్య వ్యవస్థలో చోటు లేదన్నారు. ఈ చట్టం వల్ల భూమిపై యాజమాన్య హక్కును నిరూపించుకోవడం ఎంతో కష్టసాధ్యమని.. ల్యాండ్ టైటిలింగ్ ఆఫీసర్ కింద పని చేసే వ్యవస్థకు ఇష్టముంటే హక్కు కల్పిస్తుందని లేకపోతే ఆ భూమిపై క్రయవిక్రయాలు ఆగిపోతాయన్నారు. ఇలాంటి విషయాలపై కూలంకషంగా చట్టసభల్లో చర్చ జరిగితే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. రాష్ట్రంలో స్వేచ్ఛగా ఎన్నికలు జరిగే వాతావరణం లేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. అధికార పార్టీ ప్రయోజనాల కోసం కింది స్థాయి అధికారులు పని చేయడం వల్లే ఓటర్ల జాబితా లోపభూయిష్టంగా తయారైందన్నారు. గతంలో టీచర్లు ఆ విధులు నిర్వర్తించినపుడు విమర్శలు ఇంత పెద్ద ఎత్తున రాలేదన్నారు. బీఎల్‌వోలుగా పని చేసిన వాళ్లను దూరంగా పెట్టాలని, వలంటీర్ల నీడ కూడా ఎన్నికల ప్రక్రియపై పడడానికి వీల్లేదని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసిందన్నారు. కానీ అవ్వాతాతలను స్వయంగా తీసుకెళ్లి ఓటు వేయించాలని వలంటీర్లకు ముఖ్యమంత్రి చెబుతున్నారని ఇది విస్మయం కలిగిస్తోందన్నారు. ఎన్నికల సంఘాన్ని సైతం ధిక్కరిస్తూ వలంటీర్లకు ఆదేశాలిస్తున్నారని దీనిపై అవసరమైతే న్యాయస్థానాలకు వెళ్లి పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఓ నిశ్శబ్ద విప్లవం ఆంధ్రప్రదేశ్‌లో మొదలైందని.. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, తమ అభీష్టం మేరకు ఎవరైతే సంక్షేమం, అభివృద్ధి చేస్తారో అలాంటి వారికి ఓటు వేయాలన్నారు. ఓటుని సద్వినియోగం చేసుకోవాలని మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం అన్నారు. ప్రజాస్వామ్య యుత ప్రభుత్వాన్ని తీసుకురావడంలో యువత కీలక భాగస్వామ్యం పోషించాలని పిలుపునిచ్చారు. ఓట్లు అమ్మడం కొనడం వంటివి ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు, సీనియర్ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యం అంటే ప్రజల కోసమనే అర్థం మారిపోయిందన్నారు. ప్రజాస్వామ్యం ఆర్థిక నేరగాళ్ల, భూకబ్జాదారులు, రౌడీలు, గూండాల కోసం అనే కొత్త అర్థాన్ని వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. భావవ్యక్తీకరణ చేసే పాత్రికేయులపై దాడులు చేయడం, వారిపై దేశద్రోహం కేసులు పెట్టడం ప్రజాస్వామ్యం కాబోదని విమర్శించారు. మేధావుల మౌనం సమాజానికి ప్రమాదమని.. మేధావులు, విద్యావంతులు మేల్కోవాలని కోరారు. రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంసాన్ని కళ్లారా చూస్తూ కూడా కళ్లు లేని కబోదుల్లాగా మేధావులు ఉంటే వాళ్లు ఈ సమాజానికి అన్యాయం చేసినట్లేనని.. అందువల్ల నియంతృత్వ పాలనను తరిమికొట్టడానికి వారంతా కలిసి రావాలని కోరారు. ముఖ్యంగా విద్యావంతులు, మధ్య తరగతి వారు ఓటు హక్కును ఉపయోగించుకోకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. తొలుత ఓటు ప్రాముఖ్యంపై నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అశోక్ కుమార్ జైన్, కంటిపూడి సర్వారాయుడు, కృష్ణకుమార్ తదితరులు వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు.


ఓటు హక్కు ప్రాముఖ్యంపై గేయాలాపన

ఘనంగా మహాకాళేశ్వరుడి కల్యాణం

ఇర్రిపాకలో కొనసాగుతున్న పూజా కార్యక్రమాలు


ప్రవచనాలు అందిస్తున్న స్వామీజీ

జగ్గంపేట, ఫిబ్రవరి 28: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జ్యోతుల నెహ్రూ కుటుంబం ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి పార్థివ మహా రుద్రాభిషేకంలో భాగంగా బుధవారం విఘ్నేశ్వర పూజ, పరిషత్ పంచగవ్య ప్రాసన, గోపూజ, మహాన్యాసము, రుద్రాభిషేకము, బిల్వార్చన, కుంకుమార్చన, నారాయణ ఆవాహనం నిర్వహించారు. జ్యోతుల నెహ్రూ, మణి, జ్యోతుల నవీన్, లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు సునీత దంపతులు పీటలపై కూర్చుని మహా కాళేశ్వరుడు వారి కల్యాణం జరిపించారు. ద్వాదశ జ్యోతిర్లింగాలకు పంచామృత అభిషేకం, నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గుంటూరు శ్రీ సదనం పీఠాధిపతి శ్రీ పర శివానంద భారతి స్వామీజీ, అఖిల భారత విశ్వ హిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు, శ్రీ చక్రపీఠం పీఠాధిపతులు శ్రీ వై లోకనాథ్‌శర్మ హాజరై మహా రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. భక్తులు తరలివచ్చి స్వామి వారిని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

5 నుంచి విద్యుదుత్పత్తి పునఃప్రారంభం


సీఈ శ్రీధర్

మోతుగూడెం, ఫిబ్రవరి 28: సీలేరు కాంప్లెక్సులో మార్చి 5 నుంచి విద్యుత్ ఉత్పత్తి పునఃప్రారంభించడానికి చర్యలు చేపడుతున్నామని సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్ తెలిపారు. స్థానిక విలేఖరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం లేకుండా, గోదావరి డెల్టాకు రబీ పంటలకు నీటి విడుదల నేపథ్యంలో సీలేరు కాంప్లెక్సులో ఈ నెల 10నుంచి విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశామన్నారు. అయితే ప్రస్తుతం పోలవరంలో నీటి నిల్వలు తగ్గుముఖం పడుతున్న నేపథ్యంలో వచ్చే నెల 5వ తేదీ నుంచి నీరు విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు విన్నపం మేరకు సీలేరు కాంప్లెక్సులో విద్యుత్ ఉత్పత్తి అనంతరం నీటిని గోదావరి డెల్టాకు విడుదల చేయాలని జెన్‌కో ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్పారు. ఈ మేరకు పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి అనంతరం నాలుగు వేల క్యూసెక్కుల నీరు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం బలిమెలలో ఏపీ వాటాగా 19.15 టీఎంసీలు, సీలేరు, డొంకరాయి జలాశయాల్లో 13.40 టీఎంసీల నీటి నిల్వలతో మొత్తం 32.55 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నాయన్నారు. ఈ నీటితోనే రాబోయే మూడు నెలలు (వేసవిలో) నీటిని పొదుపుగా వినియోగించుకుంటూ కాంప్లెక్సు పరిధిలోని సీలేరు, డొంకరాయి, పొల్లూరు జల విద్యుత్ కేంద్రాలకు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామని ఆయన వెల్లడించారు.

వైసీపీలోకి గొల్లపల్లి సూర్యారావు



రాజోలు, ఫిబ్రవరి 28: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు తాడేపల్లిలోని సీఎం కార్యాలయానికి వెళ్లి సీఎం జగన్ సమక్షంలో బుధవారం వైసీపీలో చేరారు. రాజోలు ఎమ్మెల్యే టికెట్‌ను జనసేనకు కేటాయించడంతో ఆయన అసంతృప్తికి గురయ్యారు. టీడీపీకి, టీడీపీ రాజోలు ఇన్‌చార్జి పదవికి రాజీనామా చేసిన లేఖను ఫ్యాక్స్ ద్వారా టీడీపీ కార్యాలయానికి గొల్లపల్లి పంపారు. వైసీపీ రాజోలు టికెట్‌ను గొల్లపల్లి ఆశిస్తున్నారు. రాజోలు నియోజకవర్గంలో 2014 నుంచి 2019 వరకు ఎమ్మెల్యేగా పనిచేశారు. 2019 నుంచి ఇప్పటివరకు రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా పని చేశారు. మాజీ మంత్రి గొల్లపల్లితో పాటు ఆయన కుమారుడు గొల్లపల్లి శ్రీధర్, కొల్లాబత్తుల కుమార్, పితాని సూరిబాబు, చిట్టూరి సంతోష్ వైసీపీలో చేరారు.

గంజాయి పంట దహనం


గంజాయి పంటను దహనం చేస్తున్న పోలీసులు

మోతుగూడెం, ఫిబ్రవరి 28: డొంకరాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో మెట్టగూడెం కొండల్లో సాగు చేస్తున్న గంజాయిని బుధవారం పోలీసులు దహనం చేశారు. గంజాయి సాగు చేస్తున్నారని డొంకరాయి ఎస్ఐ శివకుమార్‌కు వచ్చిన సమాచారంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వై.రామవరం డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకరరావు, వీఆర్వో సందీపాచార్యుల సమక్షంలో మెట్టగూడెం కొండల్లో గంజాయి సాగు చేస్తున్న వంతల జైసస్, బురిడి సహదేవ్, కొర్రా సోనియా, పాంగి నాగేశ్వరరావు, కిలో నగేష్, పీరి అప్పారావులపై మెరుపు దాడి చేసి అరెస్ట్ చేశారు. అనంతరం 1.5 ఎకరాల ఫారెస్ట్ లాండ్‌లో సాగు చేస్తున్న సుమారు రూ.2.75 లక్షల విలువ చేసే 550 గంజాయి మొక్కలను నరికేసి కాల్చి బూడిద చేశారు. అనంతరం ఆరుగురు నిందితులను డొంకరాయి ఎస్ఐ శివకుమార్ రిమాండ్ నిమిత్తం రంపచోడవరం జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు.

వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ

ముమ్మిడివరం, ఫిబ్రవరి 28: వృద్ధురాలి మెడలో బంగారు గొలుసును ఇద్దరు దొంగిలించుకుపోయారు. ముమ్మిడివరం నగర పంచాయతీ బందరుపాలానికి చెందిన కోళ్ల సత్యవతి కొత్తలంకలో జరిగే వివాహానికి వెళ్లేందుకు ఆటో కోసం ఎదురుచూస్తుండగా ఇద్దరు యువకులు మోటారుసైకిల్‌పై వచ్చి వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లో ఉన్న వ్యక్తులు తెలుసా అని అడిగారు. ఆమె తెలియదని చెప్పడంతో వారు కొంచెం ముందుకు వెళ్లి మళ్లీ వెనక్కివచ్చి ఆమె మెడలోని 2 కాసుల బంగారు గొలుసును తెంపుకుపోయారు. ఆమె పోలీసులను ఆశ్రయించగా ఎస్ఐ డి.సురేష్‌బాబు అగంతకుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్



సెక్టారు అధికారులతో సమావేశమైన సబ్ కలెక్టర్

రంపచోడవరం, ఫిబ్రవరి 28: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. తన కార్యాలయ సమావేశపు హాలులో బుధవారం ఆయన సెక్టారు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ సెక్టారు అధికారులు ఎప్పటికప్పుడు పర్యటించి రూట్ మ్యాప్‌లను పరిశీలించుకోవాలన్నారు. సమస్యలు ఉత్పన్నమైతే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో డీటీలు ఎస్‌వీవీవీ సత్యనారాయణ, శ్రీధర్, సీనియర్ సహాయకులు లక్ష్మణ్, ఇందిరాబాయ్, సెక్టారు అధికారులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ..



పథకాల గురించి వివరిస్తున్న నాయకులు

వై.రామవరం, ఫిబ్రవరి 28: వై.రామవరం మండలంలోని ఎగువ ప్రాంతాల్లో పాతకోట పంచాయతీ తుమ్మిచేరు, కర్నూతులు గ్రామాల్లో బుధవారం మండల తెలుగుదేశం పార్టీ నాయకులు బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆదేశాలతో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి వీకా నరసన్నదొర ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చంద్రబాబు హామీలలో ఉన్న సూపర్ సిక్స్ పథకాల గురించి గిరిజనులకు వివరించారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు, రైతు కుటుంబానికి సంవత్సరానికి రూ.20 వేలు, ఆడబిడ్డ నిధి కింద 18 సంవత్సరాలు నిండిన ప్రతీ మహిళకు నెలకు రూ.1500, తల్లికి వందనం పథకంలో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంతమందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ వసతి సూపర్ సిక్స్ పథకాలను చంద్రబాబు అమలు చేస్తారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో నిరుపేదలు నిరుపేదలుగానే ఉన్నారని విమర్శించారు. సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్లను పలువురికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల క్లస్టర్ ఇన్‌చార్జి కురసం సత్యనారాయణదొర, మండల కార్యదర్శి దినేష్‌రెడ్డి, యూనిట్ ఇన్‌చార్జి మరిగెల బంతి రాజు, మాజీ సర్పంచ్ సాదల బాబూరావు, బూత్ ఇన్‌చార్జి కోళ్ల శివశంకర్‌రెడ్డి, కోళ్ల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన

రంపచోడవరం, ఫిబ్రవరి 28: పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రాన్ని గోకవరం జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు బుధవారం సందర్శించారు. అగ్రికల్చర్ ఒకేషనల్ క్షేత్ర పర్యటనలో భాగంగా బుధవారం కేవీకేను సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే ఆర్డినేటర్ లలిత కామేశ్వరి పచ్చదనం-పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్.కృష్ణవేణి, సీహెచ్ ప్రదీప్, ఆనంద్, రెడ్డిబాబు పాల్గొన్నారు.

నేషనల్ సైన్స్‌డే కార్యక్రమం



రూపొందించిన ప్రాజెక్టులతో విద్యార్థులు

రంపచోడవరం, ఫిబ్రవరి 28: స్థానిక ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలో నేషనల్ సైన్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చినబాబు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులు సైన్స్ ఫెయిర్ నిర్వహించి వినూత్న ప్రాజెక్టులను ప్రదర్శించారన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది డా.జి.భాస్కర్‌రావు, జె.వెంకటలక్ష్మి, ఎం.సామ్రాజ్యం, కారం బాపిరాజుదొర, కె.సోమశేఖర్, డి.అపర్ణ, వి.సిద్ధార్థ, కె.శ్రీనుబాబు, ముసురుమిల్లి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఆర్.పి.కుమార్ పాల్గొన్నారు.

మహిళ మృతదేహం గుర్తింపు

రంపచోడవరం, ఫిబ్రవరి 28: రంపచోడవరం మండలం కొత్తపాకలు, చిలకమామిడి గ్రామాల మధ్య కొండవాగు సమీపంలో ఒక గిరిజన మహిళ మృతదేహాన్ని బుధవారం పోలీసులు గుర్తించారు. రంపచోడవరం సీఐ వెంకటేశ్వరులు, ఎస్ఐ మోహన్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. చనిపోయిన వ్యక్తి రంపచోడవరం మండలం మడిచర్ల గ్రామానికి చెందిన బిల్లా ఆదిలక్ష్మి(30)గా గుర్తించారు. మంగళవారం ఆదిలక్ష్మి రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి వచ్చింది. రాత్రి పొద్దుపోయినా ఇంటికి చేరుకోకపోవడంతో ఆమె కోసం గాలిస్తున్న బంధువులకు ఈ మృతదేహం సమాచారం అందడంతో అక్కడకు వెళ్లి ఆదిలక్ష్మిగా గుర్తించారు. రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి శవపరీక్ష నిమిత్తం మృతదేహాన్ని తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత

చింతూరు, ఫిబ్రవరి 28 : ఒడిసా నుంచి తరలిస్తున్న గంజాయిని బుధవారం సాయంత్రం చింతూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ శ్రీనివాసరావు వివరాలు ప్రకారం.. ఒడిసా రాష్ట్రం, మల్కనగిరి జిల్లా చిన్నమదుగూరుకు చెందిన కొవ్వాసి భీమా, మహారాష్ట్రకు చెందిన మహ్మద్ నయీంమీర్జా, అతని భార్య అలియా నయీం మీర్జాలతో పాటు మరొక వ్యక్తి రెండు ద్విచక్ర వాహనాలపై 25 కిలోల గంజాయిని వయా చింతూరు మీదుగా తరలించే యత్నం చేశారు. చట్టి జంక్షన్ వద్ద పోలీసులు చేపట్టిన తనిఖీలలో భాగంగా వారు పట్టుబడ్డారు. కాగా వీరిని ప్రశ్నిస్తుండగా వారిలో ఒక వ్యక్తి మోటారు సైకిల్‌తో పాటు పరారయ్యాడు. పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. పరారైన వ్యక్తి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామన్నారు. ఇక పట్టుబడిన గంజాయి విలువ రూ.75 వేల వరకు ఉంటుందని ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. అనుమానాస్పదంగా ఉన్న ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నట్లు ఆయన చెప్పారు.

5వ రోజుకు చేరుకున్న పాఠంశెట్టి దీక్ష

గోకవరం, ఫిబ్రవరి 28: గోకవరం మండలం అచ్యుతాపురం గ్రామంలో జనసేనపార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాఠంశెట్టి సూర్యచంద్ర దంపతులు చేపట్టిన అంతిమ ఆమరణ నిరాహారదీక్ష బుధవారం నాటికి ఐదోరోజుకు చేరుకొంది. టీడీపీ, జనసేన ఉమ్మడి జాబితాలో జగ్గంపేట ఎమ్మెల్యే టిక్కెట్‌ను జ్యోతుల నెహ్రూకు కేటాయించడంతో అసంతృప్తికి గురైన సూర్య చంద్ర నిరసనదీక్షకు దిగిన సంగతి తెలిసిందే. ఈ విష యంలో పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ స్పందించే వరకు దీక్షను విరమించే దిలేదంటూ సూర్యచంద్ర దంపతులు దీక్షను కొనసాగిస్తున్నారు.



ఎమ్మెల్యే గోరంట్ల ఆధ్వర్యంలో సభకు తరలివెళుతున్న టీడీపీ శ్రేణులు



కోటిపల్లి బస్టాండ్‌వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదిరెడ్డి వాసు, అనుశ్రీ

వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ కావాలి

- తెలుగుదేశం-జనసేన కూటమితో వైసీపీ పతనం ప్రారంభం
- టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గోరంట్ల
- తాడేపల్లిగూడెం సభకు తరలివెళ్లిన నాయకులు

రాజమహేంద్రవరంరూరల్/కడియం, ఫిబ్రవరి 28: వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ సాధించడం ద్వారా రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే లక్ష్యంతోనే టీడీపీ - జనసేన కూటమి ఏర్పడిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఎన్నికల శంఖారావంలో భాగంగా తాడేపల్లిగూడెంలోని ప్రత్తిపాడులో జరిగే భారీ బహిరంగ సభకు రూరల్ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. 150 కార్లు, 25 బస్సులు, 200 బైక్‌లపై భారీ ర్యాలీగా బయలుదేరారు. ఎమ్మెల్యే గోరంట్ల జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఐదేళ్ల అరాచక పాలన అంతమొందించి ఆంధ్రరాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే ప్రజా పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని దానికి చిహ్నమే టీడీపీ-జనసేన కూటమి అని అన్నారు. సంక్షేమం పేరుతో జగన్ 10 రూపాయలు చూపి 100 రూపాయలు లాగుతున్నారన్నారు.

వైసీపీ పతనం తథ్యమన్న నేతలు

రాజమహేంద్రవరం సిటీ: తాడేపల్లిగూడెంలో జరిగిన టీడీపీ-జనసేన భారీ బహిరంగ సభకు రాజమహేంద్రవరం నుంచి వందకార్లు, వెయ్యి బైక్‌లతో సుమారు ఐదువేల మంది టీడీపీ-జనసేన నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. రాజమహేంద్రవరం మోరంపూడి సమీపంలోని పాత లారీ స్టాండ్ వద్ద నుంచి టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణల ఆధ్వర్యంలో భారీ ర్యాలీగా వెళ్లారు. కోటిపల్లిబస్టాండ్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి వారు నివాళులర్పించారు. వైసీపీకి రాజీనామా చేసిన యిన్నమూరి ప్రదీప్ తాడేపల్లిగూడెంలో తమ పార్టీ అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ల సమక్షంలో టీడీపీలోకి చేరుతున్నారని చెప్పారు. టీడీపీ నగర అధ్యక్షు డు రెడ్డిమణి, ఉపాధ్యక్షుడు ఉప్పులూరి జానకి రామయ్య, పార్లమెంట్ కమిటి ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, జనసేన నాయకులు ,కార్యకర్తలు తాడేపల్లిగూడెం సభకు వెళ్లారు.

కోరుకొండ: తాడేపల్లిగూడెంలో టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి బహిరంగ సభకు రాజానగరం నియోజకవర్గం నుంచి జనసేన నాయకుడు బత్తుల బలరామకృష్ణ, టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి ఆధ్వర్యంలో 300కార్లు, 100 బస్సుల్లో భారీగా జనం తరలివెళ్లా ర

అనపర్తి: మండలంలోని రామవరం నుంచి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి భారీ కార్ల ర్యాలీతో తాడేపల్లిగూడెం సభకు తరలివెళ్లారు. సుమారు 50కార్లు, రెండు బస్సుల్లో అనపర్తి, బిక్కవోలు మండలాల కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు.

మానవాళిని చీకటి నుంచి వెలుగులోకి నడిపించేది సైన్స్

- నన్నయ వీసీ పద్మరాజు
- పలు పాఠశాలల్లో జాతీయ వైజ్ఞానిక దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 28: మానవాళిని చీకటి నుంచి వెలుగులోకి నడిపించేది సైన్స్ అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. విశ్వవిద్యాలయంలో బుధవారం జాతీయసైన్స్ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. వికసితభారత్ కోసం స్వదేశీ సాంకేతికత అనే అం శంతో నిర్వహించిన ఈకార్యక్రమంలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలు త నన్నయ విగ్రహానికి, సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సీవీ రామన్ వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విశిష్టఅతిథిగా హాజరైన మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్‌సైన్సెస్ ప్రాజెక్ట్ అప్రైజల్, మానిటరింగ్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ వై.వి.ఎన్.కృష్ణమూర్తి మాట్లాడుతూ మానవసంబంధాలు, ఆర్థికసం బంధాలు శాస్త్రసాంకేతిక రంగాలతో ఆధారపడి ఉన్నాయని గుర్తుచేశారు. ఆచార్య జి.మురళీకృష్ణ, డాక్టర్ కె.నూకరత్నం రచించిన పైథన్ ప్రోగ్రామింగ్ ఫర్ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బి.జగన్మోహనరెడ్డి, డీన్ వై.శ్రీనివాసరావు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

బిక్కవోలు: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయడానికి సైన్స్ ఎగ్జిబిషన్‌లు దోహదపడతాయని పందలపాక ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ కోణాల సత్తిరాజు తెలిపారు. సర్ సీవీ రామన్ ఎఫెక్టు కనుగొన్న రోజు సందర్భంగా జాతీయ దినోత్సవాన్ని పందలపాక ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను కోణాల సత్తిరాజు ప్రారంభించారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ ప్రాజెక్టులను పరిశీలించి ఉత్తమమైన వాటికి బహుమతులు అందజేసి, వీరికి సహకరించిన సైన్సు ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో పీఎంసీ ఛైర్మన్ కొవ్వూరి నాగిరెడ్డి, హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బిక్కవోలు ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి హెచ్‌ఎం పీవీ ప్రభాకరరావు పూలమాల వేసి నివాళులర్పించారు.

●ఇల్లపల్లి ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవాన్ని నిర్వహించారు. సీవీ.రామన్ చిత్రపటానికి హెచ్‌ఎం పి.శ్రీనివాసరెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా బిక్కవోలు ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి డాక్టర్ దుర్గాదేవి ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటుచేసి విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు జరిపారు.

రాజానగరం: సైన్సు దినోత్సవ సంబరాలను రాజానగరంలోని దివ్య విద్యా సంస్థల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి దివ్య విద్యాసంస్థల ఛైర్మన్ బర్ల సత్యనారాయణ ముఖ్యఅతిథిగా విచ్చేసి సీవీ రామన్ ఫోటోకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం వివిధ తరగతుల విద్యార్థులు పలు అంశాలపై రూపొందించిన ప్రాజెక్టులను తిలకించారు. మండలంలో వెలుగుబంద ప్రాథమికోన్నత పాఠశాలలో సైన్సుడేను పురస్కరించుకుని విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శన అందరినీ అబ్బురపరిచింది. విద్యార్థులు వివిధ అంశాలపై నమూనా ప్రదర్శన ఏర్పాటు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అగ్నేశ్వరరావు జాతీయ సైన్సుడే విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

రంగంపేట: బాల్యం నుంచి శాస్త్రీయ వైఖరిని పెంపొందించుకొని, నిత్యజీవితంలో వాటిని వినియోగించుకొని, అద్భుత ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారధి సూచించారు. రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం పాఠశాలలో సైన్స్ ప్రదర్శనలను ఆయన ప్రారంభించారు. సుమారు 200 ప్రదర్శనలను విద్యార్థులు ఏర్పాటుచేశారన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు కె.వి.వి.ఎస్.వరలక్ష్మీ, ఐ.ఎ.ఎస్.భారతి, ఎం.సత్యదేవి,టి.సావిత్రి,కె.ఓంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



బిక్కవోలు: పందలపాక పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న దృశ్యం



దివాన్‌చెరువు: శ్రీప్రకాష్ విద్యానికేతన్‌లో ప్రాజెక్టులు ప్రదర్శించి వివరిస్తున్న విద్యార్థులు

పరిశోధనలపై ఆశక్తి పెరగాలి

దివాన్‌చెరువు: శాస్త్ర, సాంకేతికరంగాల పరిశోధనలపై విద్యార్థులకు ఆశక్తి పెరగాలని స్థానిక శ్రీప్రకాష్ విద్యానికేతన్ ప్రిన్సిపాల్ ఎ.ఎస్.ఎన్.మూర్తి అన్నా రు. దివాన్‌చెరువులోని శ్రీప్రకాష్‌లో జాతీయ సైన్స్ దినోత్సవంను బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు వైజ్ఞానికప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో అకడమిక్ కోఆర్డినేటర్ విమల తదితరులు పాల్గొన్నారు.

శ్రీగౌతమిలో సైన్సు క్వెస్ట్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని 26 నుంచి 28 వరకూ సైన్సు క్వెస్ట్ పేరుతో విజ్ఞాన ప్రదర్శన నిర్వహించామని శ్రీగౌతమి కరెస్పాండెంట్ సుంకర రవి కుమార్ తెలిపారు. బుధవారం 9వ తరగతి విద్యార్థుల ప్రదర్శనను డీఈవో కె.వాసుదేవరావు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డైరెక్టర్ మల్లికార్జున్, ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పోరాట ఫలితమే సొమ్ముల విడుదల : రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఫిబ్రవరి 28: రైతుల నుంచి సేకరించిన భూమికి సొమ్ములు చెల్లించకుండా డమ్మీ పట్టాలు తయారుచేసి చేస్తున్న మోసంపై టీడీపీ చేస్తున్న పోరాట ఫలితమే రాత్రికి రాత్రి రామవరం, కుతుకులూరు, పులగుర్త గ్రామాలకు చెందిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమకావడం జరిగిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం రామవరంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూసేకరణ జరిగినా రైతులకు సొమ్ములు చెల్లించకుండా లబ్ధిదారులకు డమ్మీ పట్టాలు పంపిణీ చేసి ఓటర్లను ఆకర్షించేందుకు వైసీపీ చేస్తున్న ఆలోచనలను తిప్పికొట్టడం వల్ల అనపర్తి మండలంలో 53 మంది రైతులకు సొమ్ములు జమచేశారన్నారు. డమ్మీ పట్టాల వ్యవహారంలో అనపర్తి డిప్యూటీ తహశీల్దార్ తప్పు చేయకపోతే రాత్రికి రాత్రి ఆయనను ఎందుకు బదిలీ చేశారో చెప్పాలని, ఆదీ రంగంపేటకు బదిలీ చేయడం వెనుక మరో కుట్ర దాగి ఉందన్నారు. డమ్మీ పట్టాల తయారీపై అధికారులు సహకరించకపోయినా న్యాయస్థానం ద్వారా పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు తమలంపూడి సుధాకరరెడ్డి, సత్తి దేవదానరెడ్డి, కర్రి వెంకటరామారెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ట్యాక్సీ కిరాయి టారిఫ్ పెంచేందుకు చర్యలు తీసుకోండి

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 28: డీజిల్ ఇంధన వాహనాలపై పనులు పెంచినందుకు ట్యాక్సీ కిరాయి టారిఫ్ పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏపీ టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కోరారు. బుధవారం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ముచ్చికర్ల సత్యనారాయణ జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో డీటీవో కృష్ణారావును కలిసి వినతి పత్రం అందించారు. పెరిగిన ధరలు ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని దానికి అనుగుణంగా ట్యాక్సీలకు ఎన్నికలు తదితర ప్రభుత్వ అవసరాలకు ట్యాక్సీలను వినియోగించుకునే క్రమంలో కిరాయి టారిఫ్‌లను పెంచాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రంకిరెడ్డి సుబ్బారావు, బోరా శ్రీనివాసరెడ్డి, ఎలిపే వెంకటరమణ, షేక్ మిరా సాహెబ్ పాల్గొన్నారు.,

ఘనంగా టైలర్స్ డే

అనపర్తి, ఫిబ్రవరి 28: బుధవారం అనపర్తిలో అనపర్తి టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టైలర్స్ డేను ఘనంగా నిర్వహించారు. ముందుగా కుట్టుమిషన్ రూపకర్త విలియమ్స్‌హో జన్మదినం సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

హిందూ ధర్మాన్ని పరిరక్షించేది బీజేపీ



కంబాల శ్రీనివాసరావును మర్యాద పూర్వకంగా కలుసుకున్న రామ్‌కుమార్

గోకవరం, ఫిబ్రవరి 28: దేశంలో హిందూ ధర్మాన్ని పరిరక్షించే పార్టీ ఏదైనా ఉందంటే అది బీజేపీయేనని హిందూ ధర్మ పరి రక్షణ రామసేన వ్యవస్థాపక అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావు అన్నారు. బీజేపీ కాకినాడజిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్ బుధవారం శ్రీనివాసరావును గోకవరంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. శ్రీనివాసరావు హిందూ దేవాలయాల అభివృద్ధి కోసం చేస్తున్న కృషిని రామ్‌కుమార్ అభినందించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వాతంత్ర్యం రాక ముందు నుంచి హిందూ ధర్మంపై జరుగుతున్న దాడులను ప్రచార మాధ్యమాలలో చూసి తాను చాలా చలించిపోయానన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయ కులు జయశ్రీ, మట్టా మంగరాజు, సత్తి వెంకటరెడ్డి, బత్తుల వెంకన్నబాబు, ఇనగోటి బాపన్నదొర, రామసేన సభ్యులు మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు, వరసాల ప్రసాద్, వల్లూరి జగన్నాధశర్మ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో విభేదాలు లేవు

- పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తుక శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ పార్టీలో విభేదాలు లేవని చిన్నచిన్నవి ఉండటం సహజమని కాని మేమ అంతా ఒక్కటేనని అందరి లక్ష్యం ఏపీలో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడమేనని పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొత్తుక శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముళ్ళ మాదవ్‌లు అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం ఆనంద్ రీజెన్సీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 14న రాజమహేంద్రవరంలో కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌ఠాకూర్ పర్యటనలో పేపరుమిల్లు వద్ద జరిగిన సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్‌కు, సిటీ ఇన్‌చార్జి బోడా వెంకట్ కు మధ్య జరిగిన గొడవ నేపథ్యంలో ఇద్దరు సీనియర్ నేతల మధ్య సమోధ్య కుదిర్చేందుకు తాను వచ్చానని శ్రీనివాస్ అన్నారు.

సహనంగా ఉండాలి

- డీఎల్‌ఎస్‌ఏ కార్యదర్శి ప్రత్యూష కుమారి

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఎలాంటి పరిస్థితులు ఎదురైనా సహనంగా ఉండాలని.. ఆవేశంలో చేసే పను లవల్ల తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి పేర్కొన్నారు. రాజమహేం ద్రవరంలోని మహిళల ప్రత్యేక కారాగారంలోని సదుపాయాలను ఆమె బుధవారం పరిశీలించారు. ఖైదీతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సేవలు పొందడం ఖైదీల హక్కు అని, అవసరమైతే వారి తరఫున వాదించడానికి డీఎల్ఎస్ఏ ద్వారా ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామని స్పష్టం చేశారు. అనంతరం 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం.మాధురితో కలిసి ప్యానల్ న్యాయవాదులు, డిఫెన్స్ కౌన్సెల్ న్యాయవాదులతో డీఎల్ఎస్ఏలో మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కేసుల సత్వర పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు.

రేపటినుంచి అందుబాటులోకి భూపాలపట్నం బీఎంసీయూ: జేసీ



భూపాలపట్నం పాల సేకరణ శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ తేజ్ భరత్

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 28: భూపాలపట్నం బల్క్‌మిల్క్ యూనిట్‌ద్వారా శీతలీకరణ కోసం 46జగనన్న పాలసేకరణ కేంద్రాలు అనుసంధానం చేస్తూ గ్రామసభలు ద్వారా తీర్మానం చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ తెలిపారు. భూపాలపట్నంలో ఏర్పాటు చేయనున్న బీఎమ్‌సీయూని బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మార్చి 1వ తేదీనుంచి భూపాలపట్నం బీఎమ్‌సీయూ పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గుజరాత్ నుంచి పాలశీతలీకరణ కేంద్రానికి చెందిన పరికరాలు చేరాయన్నారు. జిల్లాలో అమూల్ పాలసేకరణ కేంద్రాలు ద్వారా పాడిరైతుల నుంచి సరైన మద్దతుధరను అందిస్తూ పాలసేకరణ ప్రక్రియ వేగవంతం చేస్తున్నామన్నారు. తొలిదశలో ఒక్కొక్క కేంద్రం ద్వారా రోజుకి 160 లీటర్లు పాలు సేకరణ లక్ష్యం సాధించేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్ర మంలో జిల్లాపశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ ఎస్.జి.టి. సత్యగోవింద్, ఏపీఎప్‌పి డిసిఎల్ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి, రాజానగరం ఎంపీడీవో జి.ఎ.కే.ఎన్.వి.జ్యోతిర్మయి పాల్గొన్నారు.

46 పాలసేకరణ కేంద్రాలు అనుసంధానం

కోరుకొండ, ఫిబ్రవరి 28: కోరుకొండ మండలం జంబుపట్నంలో ఏర్పాటు చేసిన బల్క్‌మిల్క్ యూనిట్ ద్వారా రోజుకు 5వేల లీటర్ల పాలు సేకరణ లక్ష్యమనితూర్పుగోదావరి జిల్లా జేసీ తేజ్‌భరత్ పేర్కొన్నారు. బుధవారం ఆయన జంబుపట్నం బల్క్‌మిల్క్‌యూనిట్‌ను పరిశీలించారు. బుధవారం రాత్రికే ట్రయల్‌రన్ పూర్తిచేయాలని అధికారులకు ఆదేశించారు. మార్చి1 నుంచి జంబుపట్నం బల్క్‌మిల్క్ యూనిట్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. గుజరాత్ నుంచి పాల శీతలీకరణ పరికరాలు వచ్చాయన్నారు. సాంకేతిక బృందం ఆధ్వర్యంలో సంబంధిత మిషనరీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జంబుపట్నం పరిధిలో 45 పాలవెల్లువ సేకరణ కేంద్రాలు గుర్తించడం ఆ మేరకు తీర్మానాలు చేసి అనుసంధానం చేసినట్లు జేసీ తెలిపారు. కార్యక్రమంలో జిల్లాపశుసంవర్థక శాఖాధికారి డాక్టర్ ఎస్‌జీటీ సత్యగోవిందు, ఏపీఎస్ జీడీపీఎల్ఏస్ డీవీఎస్ఎన్ మూర్తి, కోరుకొండ ఎంపీడీవో హేమసుందర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ పుప్పాల బాపిరాజుకు గాంధీ నోబెల్ పీస్ అవార్డు

రాజమహేంద్రవరం కల్చరల్, ఫిబ్రవరి 28: రాజమహేంద్రవరంలోని స్థానిక ఎస్.కె.వి.టి.ప్రభుత్వ ఉన్నత పాఠశాల డ్రాయింగ్ ఉపాధ్యాయులు, ప్రముఖ చిత్రకారులు డాక్టర్ పుప్పాల బాపిరా జుకు గాంధీ నోబెల్ పీస్ అవార్డు లభించింది. గాంధీ పీస్ ఫౌండేషన్ నేపాల్ వారు వివిధ రంగాలలో విశేషకృషి చేసిన వారికి ఈ అవార్డును అందజేస్తున్నారు. వివిధ చిత్రకళా పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించడం, కోవిడ్ సమయంలో సామాజిక బాధ్యతగా ప్రజలకు తన చిత్ర సందేశాల ద్వారా అవగాహన కల్పించడం వంటి సేవలను గుర్తించి డాక్టర్ పుప్పాల బాపిరాజును అవార్డుకు ఎంపిక చేసినట్లు సంస్థ ఛైర్మన్ ఆర్.పి.రాణా తెలిపారు. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ సెల్ఫ్‌గవర్నమెంట్ రీజినల్ డైరెక్టర్ వీరేందర్ సింగ్ పాయల్ నుంచి పుప్పాల బాలరాజు ఈ అవార్డు అందుకున్నారు. ఆంధ్రయూనివర్సిటీ సెమినార్ హాల్లో జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ పెద్దలు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా డానియల్ జోసఫ్

కొవ్వూరు, ఫిబ్రవరి 28: కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా కె. డానియల్ జోసఫ్ నియమితులయ్యారు. కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న బి.శ్రీకాంత్‌ను బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ప్రొద్దుటూరు మున్సిపాల్టీలో రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కె.డానియల్ జోసఫ్‌ను కొవ్వూ రు మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ బుధవారం ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. కొవ్వూ రు మున్సిపల్ కమిషనర్‌గా రావడానికి గతంలో కొవ్వూరులో పనిచేసిన ఒకరిద్దరు అధికారులు గట్టిగానే ప్రయత్నాలు చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రయత్నాలు అన్నీ బెడిసికొట్టాయి.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	ఊరుపేరు భైరవకోన
సూర్యామినీ	ముఖ్యగమనిక, క్రాక్
సూర్యాప్యాలస్	భ్రమయుగం
స్వామి	ఈగల్
శివజ్యోతి	అంబాజీపేట మ్యారేజ్‌బ్యాండ్
అనుశ్రీ(సాయికృష్ణ)	హనుమాన్
రాజా	ఊరుపేరు భైరవకోన
ఊర్వశి	సిద్ధార్థ్‌రాయ్
రంభ	యాత్ర-2, రాజధాని ఫైల్స్
మేనక	మస్త్ షేడ్స్ ఉన్నాయిరా, లాల్‌సలామ్
అప్సర	గుంటూరు కారం
కుమారి	సుందరం మాస్టర్
వీఎస్ మహల్(నామవరం)	ఊరుపేరు భైరవకోన
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	భ్రమయుగం
వెంకటసూర్య(కడియం)	సిద్ధార్థ్‌రాయ్
సత్యగౌరి (అనపర్తి)	హనుమాన్
సూర్యశ్రీ (అనపర్తి)	ఊరుపేరు భైరవకోన
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	ఊరుపేరు భైరవకోన
రామకృష్ణ(కోరుకొండ)	ఊరుపేరు భైరవకోన
గీతాసినిమాస్ (సీతానగరం)	ఊరుపేరు భైరవకోన
శ్రీనివాస (గోకవరం)	సైంధవ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	ఊరుపేరు భైరవకోన
లలితామహల్(రంపచోడవరం)	ఊరుపేరు భైరవకోన
నవయుగ(చింతూరు)	సిద్ధార్థ్‌రాయ్







వేదికపై చంద్రబాబు, పవన్ కల్యాణ్ అభివాదం



గద, నాగలితో పవన్ కల్యాణ్, చంద్రబాబు

గూడెంలో ఉమ్మడి సభ

సూపర్ హిట్

రాష్ట్ర భవిష్యత్ కోసమే కలిశాం

ఆశీర్వదించండి.. గెలిపించండి

- ఉమ్మడి వేదికపై చంద్రబాబు, పవన్ పిలుపు
- సభ భావోద్వేగాలు.. అభిమానుల కేరింతలు
- దూర ప్రాంతాల నుంచి భారీగా రాక
- ఎన్నికల ముందే టీడీపీ-జనసేన శ్రేణులకు అధినేతల దిశా నిర్దేశం

తాడేపల్లిగూడెం/ఏలూరు/భీమవరం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): 'టీడీపీ-జనసేన పొత్తు తాడేపల్లి ప్యాలెస్‌ను కకావికలం చేస్తోంది. రాష్ట్ర ప్రయోజనాల కోసం, వివిధ వర్గాల భవిష్యత్తు కోసం మేం కలిశాం. మమ్మల్ని ఆశీర్వదించండి.. గెలిపించండి' అంటూ టీడీపీ-జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అత్యంత ఉద్వేగంతో వైసీపీ పైకి వారు సవాళ్లు విసిరారు. ఇది నిజమా..? కాదా ? అంటూ సభికుల నుంచి సమాధానాలు రాబట్టిన ప్రసంగాలు సాగిన తీరు అందరిని హత్తుకుంది. 'తెలుగు జన విజయ కేతనం జెండా' పేరిట పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం సమీపంలోని ప్రత్తిపాడు వద్ద బుధవారం సాయంత్రం నాలుగున్నరకు మొదలైన భారీ బహిరంగ సభ రాత్రి ఎనిమిది గంటల వరకు సాగింది. టీడీపీ-జనసేన ఎన్నికల పొత్తులో భాగంగా ఇటీవల 99 మంది పోటీ చేసే అభ్యర్థులతో తొలి జాబితాను ఇరు పార్టీలు ప్రకటించాయి. దీని తర్వాత ప్రజలకు ఉమ్మడి సంకేతం ఇచ్చేందుకు సాగిన సభకు తొలిసారిగా అధినేతలు ఇద్దరు ఒకే వేదిక పైకి వచ్చారు. ఇది అటు పవన్ అభిమానులకు, ఇటు చంద్రబాబు కేడర్‌కు పండుగగా మారింది. ఇరువురు నేతలు పరస్పర ఆలింగనాలు సభికులకు మరింత కనువిందు చేసింది. ప్రత్యేకించి పొత్తు ఆ తదుపరి అభ్యర్థుల ప్రకటన తర్వాత ఎంతో క్రమశిక్షణతో నేతలు ఇద్దరు ఉమ్మడిగా జరిగిన సభలో అందరి మనసులు దోచారు. చంద్రబాబు సైతం సుమారు 50 నిమిషాలపాటు ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఎన్నికల ముందు ముద్దులు.. గెలిచాక మీడియాతో సహా అందరిపైన పిడిగుద్దులా అంటున్నపుడు సభికులు అవును అవునంటూ తెలిపారు.

రెండు కలిసే నడుస్తున్నాయి : చంద్రబాబు

'ప్రజలకు రోషం ఉందా.. మాకైతే రోషం ఉంది. ఒక సీనియర్‌గా జరుగుతున్నదంతా చూస్తూ ఊరుకోలేను. ప్రశ్నించే గుణం ఉన్నా పవన్ సైతం మౌనంగా ఉండలేదు. జనం కోరుకునే వెలుగు మీకు ఇచ్చే బాధ్యత మాది' అంటూ చంద్రబాబు భరోసా ఇవ్వడం అందరిని సంతృప్తి పరిచింది. రాష్ట్ర విభజన అంశాలు ప్రజలకు గుర్తు చేస్తూ అప్పట్లో జరిగిన నష్టాన్ని ఎత్తి చూపాం. ఇప్పటికి అదే ధోరణిలో రాష్ట్రాభివృద్ధికి అనువుగానే జనసేన టీడీపీ లక్ష్యాల తీరు ఉందని చంద్రబాబు ప్రజలకు పదే పదే వివరించారు. ప్రజల కోసం కన్న కలల సౌధాన్ని జగన్ వచ్చి నాశనం చేశాడు. పొత్తు ఎందుకని ఆలోచిస్తే అందరికి అవగాహన వస్తుంది. ఆఖరికి అంతర్జాతీయ క్రికెటర్ విహారిని రాష్ట్రం నుంచి పారిపోయేలా చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే అంటూ గుర్తు చేసినప్పుడు షేమ్ షేమ్ అంటూ సభికులు ప్రతిస్పందించారు. రాష్ట్రంలో కులాల మధ్య ప్రాంతాల మధ్య విభేదాలు సృష్టించి సర్వనాశనం చేయాలని, ఆ దిశగా ఈ ప్రభుత్వం వ్యవహరిస్తోంది. కాని, నేను, పవన్ రాష్ట్రాన్ని నెంబర్-1 చేయాలనుకుంటున్నాం. సినిమా టిక్కెట్లలోను రాజకీయాలు చేయడం ఎంత వరకు సబబు. ఇది భావ్యమా' అంటూ ప్రశ్నించి సభికుల నుంచి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశారు. వచ్చే ఎన్నికల్లో మన గెలుపును ఎవరూ ఆపలేరని, బాధ్యత కలిగిన అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేశామని మాఫియా నేతలు కావాలా.. మంచి నేతలు కావాలంటూ ప్రజలను ప్రశ్నించారు. ఉద్యోగుల అంశాలను ప్రస్తావిస్తూ ఇప్పుడున్న ప్రభుత్వం ఉద్యోగులపై ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఏం చేయబోతున్నామో త్వరలోనే ప్రకటిస్తామన్నారు. కిందిస్థాయి కేడర్‌లో ఉన్న భావాలను స్పృశిస్తూ ..ఇగోలకు పోవద్దు.. ఒక పార్టీ వెనుక ఇంకో పార్టీ నడుస్తున్నట్టు భావిస్తారు. ఇదంతా కాదు రెండు పార్టీలు కలిసి నడుస్తాయని భావించాలని, అనుభవంతో చెబుతున్నానని చంద్రబాబు ప్రకటించినప్పుడు టీడీపీ-జనసేన కేడర్ సంతృప్తితో కేరింతలు కొట్టారు. టీడీపీ కేడర్ ఎంపిక తీరుపై అక్కడక్కడ అసంతృప్తి వ్యక్తం చేస్తుండగా పరోక్షంగా ప్రస్తావిస్తూ అందరికి తగిన న్యాయం చేయడం సాధ్యం కాదని, అవకాశాలను బట్టి అందరికి ఆమోదయోగ్యంగా న్యాయం చేస్తామన్నారు. పవన్ కల్యాణ్ కూడా కాస్తంత ఉత్తేజభరితంగానే మాట్లాడుతూ కేడర్‌కు దిశా నిర్దేశం చేశారు. ఇంతకు ముందు జరిగిన తన ఓటమిని గుర్తు చేసుకున్నారు. పొత్తులో జనసేన ఎన్ని సీట్లు తీసుకోవాలి.. సీఎం పదవిని ఎలా పంచుకోవాలి అంటూ లేఖలతో సలహాలు ఇచ్చిన వారందరికి నర్మగర్భంగా మాట్లాడుతూ చెక్ పెట్టారు. ఆయన ఏమన్నారంటే.. 'నాకు ఎవరి సలహాలు అక్కరలేదు. జిల్లా నుంచి ఇటీవల సలహాలు ఇస్తూ బహిరంగ లేఖలు రాస్తున్నారు. కొందరు సీనియర్ల లేఖలు పొత్తుపై ప్రభావం చూపుతున్నాయి. ఒంటరిగా పోటీ చేసే శక్తి ఇప్పటికిప్పుడు జనసేనకు లేదు. నాపై విమర్శలు చేసే వారు ముందుగా దీనిపై ఆలోచించాలి. జగన్ వెనుక ఉన్న సమూహాలు మాత్రం తప్పు చేసినా దోపిడీ చేసినా ఆహా.. ఓహో అంటూ ఉన్నారు. వెనకేసుకొస్తున్నారు. కాని, సామాన్యుడు రాజకీయం చేస్తే ఇలాగే ఉంటుందని నిరూపిస్తా. ఎవరికి ఎంత ఓపికో పరీక్షించుకోవాలి. నాతో నిలబడి.. నా వెంట నడిచేవారే నా వాడు'.. అంటూ పవన్ ఉద్వేగంగా మాట్లాడటంతో సభికుల నుంచి స్పందన లభించింది. ప్రత్యేకించి సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన చంద్రబాబు, నేను రాష్ట్రం కోసమే కలిసి పని చేస్తామంటూ స్పష్టం చేశారు.



సభలో ప్రసంగిస్తున్న పవన్ కల్యాణ్



వేదికపై చంద్రబాబు, పవన్ కల్యాణ్, బాలకృష్ణ తదితరులు



సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

అందరి చూపు వేదిక మీదే..

ఓ వైపు సభా సమయం రాత్రి గడుస్తున్నా అందరిచూపు వేదిక మీదే వుంది. టీడీపీ-జనసేన రాష్ట్ర నియోజకవర్గ నేతలు ఆశీనులు కావడమే నిదర్శనం. ఏ ఒక్క పార్టీ తక్కువ కాదని అంతా సమానమేని అన్నట్టుగా వేదికపైన మొత్తం 500 మంది కూర్చోగా రెండు పార్టీల నేతలకు చెరి సగం అన్నట్టుగానే సభా వేదిక ఏర్పాటు చేశారు. ఒక వైపు టీడీపీ జెండా, మరో వైపు జనసేన జెండా ఉండేలా ఈ పతకాల కిందే ఇరు పార్టీలు నేతలు ఆశీనులయ్యారు. ప్రత్యేకించి జనసేనలో కొత్తగా చేరిన కొత్తపల్లి సుబ్బారావు, కొణతాల రామకృష్ణ వంటి సీనియర్ నేతలు సైతం కొద్దిసేపు ప్రసంగించారు. రామకృష్ణ అయితే జనసేన టీడీపీ మాదిరిగానే ఈ రెండింటితో బీజేపీ కలిసి వచ్చేలా చూడాలని కోరడం మరో విశేషం. పవన్ తమ ప్రసంగం ఆఖరిలో బీజేపీకి జై అంటూ ముగించారు. టీడీపీ పక్షాన వేదిక ముందు భాగంలో చంద్రబాబుతోపాటు అచ్చెన్నాయుడు, బాలకృష్ణ, సీతారామలక్ష్మి, పితాని సత్యనారాయణ, వలవల బాబ్జి, రఘురామకృష్ణంరాజు కూర్చుండగా పవన్ పక్కన నాదెండ్ల మనోహర్, కొణతాల రామకృష్ణ, కొటికలపూడి గోవింద రాజు, కందుల దుర్గేష్, బొలిశెట్టి శ్రీనివాస్ ఉన్నారు. టీడీపీలో సీనియర్ నేతలు బుచ్చియ్యచౌదరి, చినరాజప్పతో పాటు కొలుసు పార్థ సారథి, చింతమనేని ప్రభాకర్, ముళ్లపూడి బాపిరాజు, కంభంపాటి రామ్మోహన్, నిమ్మల రామానాయుడు, పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత పాల్గొన్నారు.

జనమే జనం

రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున జనం తరలి వచ్చారు. ఇరు పార్టీల అగ్రనేతలు ఒకే వేదిక పైకి రావడంతో ఈ వేదికకు రాజకీయ ప్రాధాన్యం పెరిగింది. దీంతో వివిధ నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, నేతలు తరలి వచ్చారు. టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, పవన్ వేదిక పైకి రాక ముందే పలువురు సీనియర్లు ప్రసంగించారు. నిమ్మల రామానాయుడు, రఘురామకృష్ణంరాజు, బాలకృష్ణ, వలవల బాబ్జి, దుర్గేష్, కొత్తపల్లి సుబ్బారాయుడు వంటి వారు మాట్లాడడంతో జనం కేరింతలతో సభ దద్దరిల్లింది. రఘురామకృష్ణంరాజు సెటైర్లు వేస్తున్నపుడు వేదికపై ఉన్న పవన్, చంద్రబాబు ముసిముసి నవ్వులు చిందించారు. తాను వచ్చే ఎన్నికల్లో నరసాపురం నుంచి పోటీ చేస్తానని రఘురామకృష్ణంరాజు వ్యాఖ్యానించిప్పుడు సభలో కేరింతలు వినిపించాయి.

అభిమానుల జోష్

తెలుగుదేశం-జనసేన ఉమ్మడి సభలో అభిమానుల జోష్ అంతా ఇంతా కాదు. కార్యకర్తలను, అభిమానులను అడ్డుకోవడం పోలీసులు తరం కాలేదు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లను వీక్షించేందుకు ఫ్లడ్‌లైట్ స్తంభాలను ఎక్కేశారు. మహిళలు అందుకు పోటీ పడ్డారు. పసుపు చీరలు ధరించి వేలాదిగా మహిళలు సభకు తరలి వచ్చారు.



సభలో టీడీపీ నాయకులు



సభలో జనసేన నాయకులు



కొవ్వూరులో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్

కొవ్వూరులో కలెక్టర్ పలు పోలింగ్ కేంద్రాల పరిశీలన

కొవ్వూరు, ఫిబ్రవరి28: గత ఎన్నికలకంటే పోలింగ్ శాతం పెరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. మాధవీలత అన్నారు. కొవ్వూరు పట్టణంలోని సంస్కృత కళాశాల, సంస్కృత ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాలల్లో ఉన్న 82, 83, 86, 89 పోలింగ్ కేంద్రాలను అధికారులతో కలిసి బుధవారం కలెక్టర్ పరిశీలించారు. అనంతరం బీఎల్వోలు, సెక్టోరల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కొవ్వూరు నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో 86.41 శాతం పోలింగ్ నమోదైందన్నారు. నియోజకవర్గ సగటుకంటే తక్కువ పోలింగ్ నమోదైన వివరాలు పీఎస్‌ల వారీగా అందుబాటులో ఉన్నాయన్నారు. గతంలో తక్కువ పోలింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాల వద్ద స్వీప్ కార్యకలాపాలతోపాటు రాజకీయ పార్టీలతో కలిసి ప్రత్యేక ప్రచార కార్యక్రమాలను చేపట్టాలన్నారు. నియోజకవర్గ సగటు ఓటరు నమోదు 86.41 శాతంకంటే తక్కువ 69.12 శాతం నుంచి 76.97 శాతం నమోదైన పీఎస్‌ల బీఎల్వోలతో కలెక్టర్ సమీక్షించారు. ఓటర్లలో ఓటుహక్కుపై చైతన్యం తీసుకురావడం కోసం తగిన ప్రణాళికలు, కార్యాచరణ సిద్ధం చేయాలని ఆర్వోని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులను కలుపుకుని వెళ్లి ఓటింగ్ శాతం పెరిగేలా బీఎల్వోలు ఇంటింటికి వెళ్లి చైతన్యం తీసుకురావడానికి సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, తహశీల్దార్ కె.మస్తాన్, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.



అలంకార ప్రాయంగా కొన్ని కంపెనీల డెస్కులు.. బయోడేటాల స్వీకరణ తంతు.. భోజనాల దగ్గర ఒకటే స్టంట్లు

ఆశగా వచ్చి.. 'నిరాశతో వెనుదిరిగి'

- జాబ్‌మేళాతో వంచన
- ఉసూరుమన్న నిరుద్యోగులు
- బయోడేటా తీసుకొని వెళ్లమన్న కంపెనీలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): '2022లో బీటెక్ పూర్తయ్యింది. 2023లో ఇంటర్న్‌షిప్ పూర్తిచేశాను. ఐదేళ్ల నుంచీ ఒక్క నోటిఫికేషనూ లేదు. జాబ్‌మేళాలకు వెళ్తున్నాను. అలాగే ఇక్కడికి వచ్చాను. బయోడేటా తీసుకున్నారు. తర్వాత ఫోన్ చేస్తామన్నారు. నేను చదివింది బీటెక్. వాళ్లు ఇచ్చే జీతం పదివేలట. ప్చ్.. యువత బతుకు ఇదీ!'.. శ్రీను అనే ఓ అభ్యర్థి ఆవేదన. 'నేను అన్ని కంపెనీలకూ నా రెస్యూమ్ ఇచ్చేశాను. తర్వాత ఫోన్ చేస్తానన్నారు. ఆ ఫోన్ కోసం ఎదురుచూడడమే.. వస్తుందో రాదో అనుమానమే!'.. లక్ష్మి అనే ఓ విద్యార్థిని నిర్వేదం. రాజమహేంద్రవరంలోని మార్గాని ఎస్టేట్స్‌లో ఏర్పాటుచేసిన మెగా జాబ్ మేళాకు వచ్చిన ఆ అభ్యర్థుల అభిప్రాయాలివి. నిరుద్యోగులను వైసీపీ ప్రభుత్వం ఓ తీరున మోసం చేస్తుంటే.. వైసీపీ ప్రజాప్రతినిధులు 'తామేమి తక్కువ తిన్నామా' అనుకుంటూ నిరుద్యోగ యువత భవితవ్యాలతో ఆటలాడుకుంటున్నారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ నిర్వహించిన జాబ్ మేళాను ఎంపీ భరత్‌రామ్ నిస్సిగ్గుగా తమ రాజకీయ ప్రచారానికి వాడుకొన్నారు. ఆశతో వచ్చిన యువత ఉసూరుమంటూ ఇంటిదారి పట్టారు. సీఎం జగన్ ఐదేళ్ల నుంచీ ప్రభుత్వ ఉద్యోగాలకు ఒక్క నోటిఫికేషనూ ఇవ్వలేదు. పాలనాకాలం ముగుస్తుందనగా హడావుడిగా మెగా డీఎస్సీ అంటూ 30 వేల ఖాళీలకుగాను 6 వేల ఉద్యోగాలతో ఓ నోటిఫికేషన్ తీసుకొచ్చారు. అది దగా డీఎస్సీ అనే ఆరోపణలు బహిరంగంగానే పెద్దఎత్తున వ్యక్తమవుతున్నాయి. జగన్ దారిలోనే నడుస్తున్న వైసీపీ ప్రజాప్రతినిధులు కూడా నిరుద్యోగుల మనోభావాలతో ఆడుకుంటున్నారు. మెగా జాబ్ మేళాలంటూ ప్రచారంతో ఊదరగొడుతున్నారు. వాస్తవానికి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఈ మేళాలను నిర్వహిస్తోంది. రాజకీయ మైలేజీ కోసం ఎంపీ భరత్ వీటినీ వదల్లేదు. బుధవారం మెగా జాబ్ మేళా పేరుతో ఓ జాతర నిర్వహించారు. 100కి పైగా కంపెనీలు ఉద్యోగాలు ఇచ్చేస్తాయని ప్రచారం ఊదరగొట్టారు. దీంతో రాజమహేంద్రవరంతోపాటు కాకినాడ, అమలాపురం, తణుకు తదితర ప్రాంతాల నుంచి యువత ఆశగా వచ్చారు. టెంట్లు వేసి ఒక్కో గదిలో మూడు నాలుగు సంస్థల ప్రతినిధులు కూర్చున్నారు. అభ్యర్థులను ఏవో నాలుగు ప్రశ్నలు అడిగి రెస్యూమ్ తీసుకొని సాగనంపారు. ఒకవేళ తాము పిలిచినా మూడు దశల్లో ఇంటర్వ్యూ జరుగుతుందని, అవన్నీ ఉత్తీర్ణత సాధిస్తే శిక్షణ ఇస్తామని తర్వాతే జాబ్ ఉంటుందని చెప్పి పంపేశారు. జాబ్‌లు ఇస్తామంటూ వచ్చిన కంపెనీల్లో ఒకట్రెండు మినహా మిగతావన్నీ చిన్నాచితకా కంపెనీలని తెలుస్తోంది. ఓ సంస్థ డ్రైవరు ఉద్యోగానికి కూడా జాబ్ మేళాను ఆశ్రయించడం ఆశ్చర్యపరిచింది. మరోవైపు ఉద్యోగ జాతరకు వచ్చిన అభ్యర్థులతో సభ ఏర్పాటుచేశారు. ముఖ్య అతిథిగా ఎంపీ భరత్ విచ్చేశారు. తాము నగరానికి చేసిన మేలు అంతా ఇంతా కాదు ఎంతో.. అంటూ ఉపన్యాసం ఇచ్చారు. మిగతా వారూ ఎంపీని పొగడ్తలతో ముంచెత్తారు. మేళా ప్రవేశ ద్వారం వద్ద వచ్చేవారికి ఎంపీ బొమ్మతో ముద్రించిన కరపత్రాలను తెగ పంచేశారు. భోజన ఏర్పాట్లు చేశామని చెప్పినా సరైన పద్ధతి లేక అభ్యర్థులు తీవ్రంగా ఇబ్బందిపడ్డారు.

పకడ్బందీగా పది పరీక్షలు : డీఆర్వో

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 18 నుంచి 30 వరకూ జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో నరసింహులు ఆదేశించారు. సంబంధిత అధికారులతో ఆయన బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 30,116 మంది విద్యార్థులకు 137 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకూ పరీక్ష జరుగుతుందన్నారు. విద్యార్థులను 8.45 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద అత్యవసర మందులు అందుబాటులో ఉంటాయని, తాగునీటి సదుపాయం ఉంటుందన్నారు. దివ్యాంగులు స్క్రయిబ్‌ని ఏర్పాటు చేసుకునే అవకాశం కల్పించారన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ అనిల్‌కుమార్, డీఈవో వాసుదేవరావు, డీటీవో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో సూచనలిస్తున్న డీఆర్వో నరసింహులు



రైతుభరోసా చెక్కును విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్, జేసీ

రైతు భరోసా నిధులు విడుదల

రాజమహేంద్రవరం రూరల్, ఫిబ్రవరి 28: వైఎస్సార్ రైతు భరోసా పీఎం కిసాన్ పథకం కింద జిల్లాలో 1,41,216 మంది రైతులకు రూ.28.39 కోట్లు, 2023-24 ఆర్థిక సంవత్సరానికి సున్నావడ్డీ రాయితీ కింద 30,714 మంది రైతులకు రూ.5.86 కోట్లు రైతుల ఖాతాలకు జమ అయినట్టు కలెక్టర్ డాక్టర్ మాధవీలత తెలిపారు. బుధవారం రైతుభరోసా, పీఎం కిసాన్ పథకం వడ్డీ రాయితీ, సున్నా వడ్డీ పంట రుణాల పథకం కింద సీఎం కార్యాలయంలో ఆర్థిక సాయాన్ని వర్చువల్ విధానం ద్వారా సీఎం జగన్ రైతుల ఖాతాలకు జమచేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, రైతులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తంచేస్తున్న బోటు కార్మికులు

డ్రెడ్జింగ్ వ్యతిరేకిస్తూ ధర్నా

రాజమహేంద్రవరం రూరల్/సిటీ, ఫిబ్రవరి 28 : రాజమహేంద్రవరం గాయత్రి ఇసుక ర్యాంప్‌లలో పట్టపగలే ధవళేశ్వరం కాటన్ బ్యారేజీకి అతి సమీపంలో గోదావరి గర్భాన్ని చీల్చి ఇసుకను డ్రెడ్జింగ్ చేస్తున్నారు. బుధవారం ఉదయం ఈ ర్యాంప్‌లలో డ్రెడ్జింగ్ పనులను ఇసుకతీత కార్మికులు అడ్డుకున్నారు. డ్రెడ్జింగ్ వల్ల సుమారు 3 వేల మంది కార్మికులకు పనులు లేకుండా పోయాయని వారంతా ఆందోళనకు దిగారు. లేబర్ యూనియన్ అధ్యక్షుడు వెంకట్రావు, శ్రీను, సునీల్, అప్పన్న, పోతురాజు, ప్రసాద్, కిరణ్, వెంకటేశ్వరావు, వంశీలు నిరసన ధర్నా చేశారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అయితే అప్పటివరకు పోలీసులుగాని, అధికారులుగాని డ్రెడ్జింగ్‌ను గాలికి వదిలేసి.. ఆందోళన చేస్తున్న కార్మికులను అడ్డుకోవడానికి రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అధికారులు కళ్లు తెరిచి డ్రెడ్జింగ్ ద్వారా ఇసుక తవ్వకాలను నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. డ్రెడ్జింగ్ తవ్వకాలు తాత్కాలికంగా నిలుపుదల చేయడంతో ఆందోళన విరమించారు.



నిడదవోలులో పోలింగ్ కేంద్రం వద్ద రూట్ మ్యాప్ పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మాధవీలత

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

● నిడదవోలులో పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

నిడదవోలు, ఫిబ్రవరి 28 : ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవడంతో పాటు ఈవీఎంలపై అవగాహన పెంచాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి డాక్టర్ కె.మాధవీలత అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారిణి డాక్టర్ కె.మాధవీలత మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో 85.02 శాతం ఓటింగ్ నమోదైందన్నారు. గత ఎన్నికల్లో ఓటింగ్ శాతం తక్కువగా నమోదైన పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక స్వీప్ కార్యకలాపాలను చేపట్టాల్సి ఉందన్నారు. 67.88%, 73.93% ఓటింగ్ నమోదైన పోలింగ్ కేంద్రాల బీఎల్‌వోలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె వెంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఆర్‌వీ రమణనాయక్, తహసీల్దార్ నాగభూషణం పలువురు అధికార్లు, బీఎల్‌వోలు ఉన్నారు.

ఘనంగా టైలర్స్ డే

నల్లజర్ల, ఫిబ్రవరి 28 : మండలంలోని అనంతపల్లిలో టైలర్స్ డే వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కుట్టుమిషన్ సృష్టికర్త విలయమ్స్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీనియర్ దర్జీ వంటెద్దు మెహర్ బాబా, గౌరవ అధ్యక్షుడు తాళ్ళూరి సత్యనారాయణ, యువ టైలర్ మీసాల అప్పారావులను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షకార్యదర్శులు తలారి కృష్ణ, ఏలూరి సత్యనారాయణ, కృష్ణ పాల్గొన్నారు.

తాళ్ళపూడి: తాళ్ళపూడిలో టైలర్ల సంఘం ఆధ్వర్యంలో బుధవారం టైలర్స్ డేని ఘనంగా జరుపుకున్నారు. కుట్టుమిషన్ కనిపెట్టిన విలియమ్స్ హో జన్మదినాన్ని టైలర్స్ డేగా జరుపుకుంటున్నామని మండల టైలర్స్ సంఘ అధ్యక్షుడు ఒంబోలు పోసిబాబు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని పలువురు టైలర్లు హాజరయ్యారు.

పెరవలి: టైలర్స్ డే సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో టైలర్స్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. కానూరులో కుట్టు మిషన్ కనిపెట్టిన విలియమ్స్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

ఉండ్రాజవరం: మండలంలో పలుగ్రామాల్లో బుధవారం టైలర్స్ డేను దర్జీలు ఘనంగా నిర్వహించారు. వేలివెన్నులో ఈశ్వరఅల్లా టైలర్స్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా కుట్టుమిషన్ కనిపెట్టిన విలియమ్ హోవే చిత్రపటానికి పూలమాలవేసి నివాలులర్పించారు.

సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలు చేయాలి



కొవ్వూరులో నిరాహార దీక్ష చేస్తున్న దృశ్యం

కొవ్వూరు, ఫిబ్రవరి 28 : అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దుచేసి అన్యాయం చేసిందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుందరబాబు విమర్శించారు. భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమబోర్డు ద్వారా పథకాలు అమలుచేయాలని కోరుతూ కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో బుధవారం నిరాహరదీక్ష చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు వల్లేపల్లి నరసింహామూర్తి అధ్యతన జరిగిన కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు మద్దతు తెలియజేశారు. సుందరబాబు మాట్లాడుతూ నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలుచేసిన పార్టీకే కార్మికుల మద్దతు ఉంటుందన్నారు. టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ సూరపనేని చిన్నిలు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వం అంటూనే కార్మికులు పోరాడి సాధించుకున్న జాతీయ సంక్షేమ చట్టాన్ని నిలుపుదల చేసిందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టి.వి.రామారావు మాట్లాడుతూ జనసేన, టీడీపీ కూటమి అధికారంలోకి వస్తే కార్మికులకు ఇ.ఎస్.ఐ సౌకర్యంతో పాటు, కార్మికచట్టాన్ని పూర్తిస్థాయిలో అమలుచేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు, వై.వరప్రసాద్, ఎం. రఘురామ్, వైసీపీ నాయకులు పరిమి హరిచరణ్‌లు కార్మికుల దీక్షకు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో మైగాపుల నాగేశ్వరరావు, మద్దుకూరి దొరయ్య, జొన్నల రాంబాబు, వీర త్రిమూర్తులు, మారెళ్ల కనకశ్రీను, ఎం. శ్రీను, కె. సతీష్, ఎం. శ్రీనివాస్, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో జరిగే మహాగర్జనను జయప్రదం చేయండి

● జేఏసీ చైర్‌పర్సన్ దయామణి



నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దయామణి

నిడదవోలు, ఫిబ్రవరి 28: వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రెగ్యులర్‌కు, సమాన పనికి సమాన వేతనం కోసం నిర్వహి స్తున్న మహాగర్జనను జయప్రదం చేయాలని వైద్య ఆరోగ్యశాఖ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్‌పర్సన్ దయామణి అన్నారు. బుధవారం నిడదవోలు పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (ప్రభుత్వ ఆసుపత్రి) వద్ద మహాగర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 3న విశాఖ పట్టణంలో మహాగర్జనకు పిలుపునిచ్చామన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం రెగ్యులర్ చేయడం అనేవి నేటికీ అమలు చేయకుండా కనీస వేతనాలు చెల్లించకుండా లక్షలాది మంది కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను మోసం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్‌నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్స్, ఆరోగ్య మిత్రలు, 108 సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం రిజర్వుడ్ స్థానాన్ని మాలలకే కేటాయించాలి

గోపాలపురం, ఫిబ్రవరి 28: రానున్న సాధారణ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు గోపాలపురం రిజర్వ్‌డ్ స్థానాన్ని మాలలకే కేటాయించాలని మాలమహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసి డెంట్ బొంతా రవిప్రకాశ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని వేలచింతల గూడెంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మాలల సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. పీవీరావు మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు వట్టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన పోస్టర్ ఆవిష్కరణ అనంతరం రవిప్రకాశ్, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గంలో 46వేల మంది మాలసామాజిక వర్గానికి చెందిన ఓటర్లు ఉన్నారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ వ్యతిరేకిస్తూ మార్చి 3వ తేదీన జరిగే మాలల సింహగర్జన సదస్సుకు మాలలంతా అధికసంఖ్యలో తరలి రావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో కొయ్య వెంకటరమణ, రాపాక శంకరం, మరపట్ల సునీల్, కొయ్య భీమరాజు, సంజీవరావు పాల్గొన్నారు.

పోలీస్ యూనిఫామ్‌లో భిక్షాటన



పోలీస్ వేషధారణలో యాచకుడు

నిడదవోలు, ఫిబ్రవరి 28: గుళ్లో నుంచి బయటకు వచ్చిన భక్తులు గుడి బయట నేలపై కూర్చుని యాచిస్తున్న పోలీస్ యూనిఫామ్‌లో ఉన్న వ్యక్తిని చూస్తే భక్తులు ఒక్కసారిగా ఆశ్చర్యానికి లోనయ్యారు. తీరా తీక్షణంగా పరిశీలిస్తే అతడు యాచకుడే. అతని ఒంటిపై ఉన్న పోలీస్ యూనిఫామ్ ఎవరో పోలీస్ సిబ్బంది ఇస్తే వేసుకున్నదే. కుడిచేతి భుజానికి ఉన్న పోలీస్ బ్యాడ్జి అలాగే ఉంచేయడంతో పోలీసే ఇలా యాచకుడిగా మారాడా అని ఆశ్చర్యపోయారు. తీరా చూస్తే ప్యాంటు మోకాళ్ల వరకు కట్‌చేసి ఉండడంతో ఇతను యాచకుడే అని గుర్తించారు. పోలీస్ సిబ్బంది తమ యూనిఫామ్‌లను దానం చేసే టప్పుడు పోలీస్ బ్యాడ్జి తొలగించి ఉంటే ఇలాంటి అపోహ వచ్చేది కాదంటూ స్థానికులు పేర్కొన్నారు. ఈ సంఘటన బుధవారం నిడదవోలు పట్టణంలోని నంగాలమ్మ గుడి, గోలింగేశ్వరస్వామి ఆలయం వద్ద చోటుచేసుకుంది.

కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా డానియల్ జోసఫ్

కొవ్వూరు, ఫిబ్రవరి 28: కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా కె. డానియల్ జోసఫ్ నియమితులయ్యారు. కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న బి.శ్రీకాంత్‌ను బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ప్రొద్దుటూరు మున్సిపాల్టీలో రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కె.డానియల్ జోసఫ్‌ను కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ బుధవారం ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. కొవ్వూరు మున్సిపల్ కమిషనర్‌గా రావడానికి గతంలో కొవ్వూరులో పనిచేసిన ఒకరిద్దరు అధికారులు గట్టిగానే ప్రయత్నాలు చేశారు. ఎన్నికల నిబంధనల మేరకు ప్రయత్నాలు అన్నీ బెడిసికొట్టాయి.



కొవ్వూరు నుంచి తాడేపల్లిగూడెం సభకు వెళ్తున్న టీడీపీ, జనసేన నాయకులు



తాళ్లపూడి: వేగేశ్వరపురం నుంచి బయలుదేరిన టీడీపీ జనసేన నాయకులు



గోపాలపురం: టీడీపీ, జనసేన బహిరంగ సభకు వెళ్తున్న భీమోలు గ్రామస్థులు

వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ కావాలి

● తెలుగుదేశం-జనసేన కూటమితో వైసీపీ పతనం ప్రారంభం
● టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు గోరంట్ల
● తాడేపల్లిగూడెం సభకు తరలివెళ్లిన నాయకులు

రాజమహేంద్రవరంరూరల్/కడియం, ఫిబ్రవరి28: వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ సాధించడం ద్వారా రాష్ట్రంలో సంక్షేమంతోపాటు అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించే లక్ష్యంతోనే టీడీపీ - జనసేన కూటమి ఏర్పడిందని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు,రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఎన్నికల శంఖారావంలో భాగంగా తాడేపల్లిగూడెంలోని ప్రత్తిపాడులో జరిగే భారీ బహిరంగ సభకు రూరల్ నియోజకవర్గం నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. 150 కార్లు, 25 బస్సులు, 200 బైక్‌లపై భారీ ర్యాలీగా బయలుదేరారు. ఎమ్మెల్యే గోరంట్ల జెండా ఊపి వాహనాలను ప్రారంభించారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ ఐదేళ్ల అరాచక పాలన అంతమొందించి ఆంధ్రరాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే ప్రజా పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని దానికి చిహ్నమే టీడీపీ-జనసేన కూటమి అని అన్నారు. సంక్షేమం పేరుతో జగన్ 10 రూపాయలు చూపి 100 రూపాయలు లాగుతున్నారన్నారు.

కొవ్వూరు: తాడేపల్లిగూడెంలో నిర్వహిస్తున్న టీడీపీ, జనసేన ఎన్నికల శంఖారావం బహిరంగ సభకు కొవ్వూరు నుంచి కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లారు. బుధవారం కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి టోలిగేట్ సెంటర్‌లోని జనసేన నియోజకవర్గ కార్యాలయం నుంచి మోటారుసైకిళ్లు, కార్లలో ర్యాలీగా బయలుదేరారు. ర్యాలీని టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావులు ప్రారంభించారు. కొవ్వూరు నుంచి ఔరంగాబాద్, వాడపల్లి, మద్దూరు, సీతంపేట, నిడదవోలు ప్రతిపాడు మీదుగా తాడేపల్లిగూడెం ర్యాలి కొనసాగింది. ఈ ర్యాలీలో అర్బన్‌బ్యాంకు ఛైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్న, పొట్రు శ్రీనివాస్, మద్దుల సత్యనారాయణ, యలమర్తి శ్రీరాంప్రసాద్, కాగిత రఘు, గెల్లా సురేష్, జనసేన పట్టణ, మండల అధ్యక్షులు డేగల రాము, సుంకర సత్తిబాబు, ఎంపిటిసి ఎరుబండి సురేష్, గంగుమళ్ళ స్వామి, కె. శ్రీను, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లజర్ల: టీడీపీ,జనసేన సంయుక్తంగా బుధవారం తాడేపల్లిగూడెంలో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు నల్లజర్ల మండలం నుంచి భారీగా టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. గోపాలపురం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మద్దిపాటి వెంకట్రాజు, జనసేన నియోజకవర్గ కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణరాజు ఆధ్వర్యంలో భారీ వాహనాలతో బహిరంగ సభకు తరలి వెళ్లారు. ముందుగా ప్రకాశరావుపాలెంలో జెండాఊపి ర్యాలీని ప్రారంభించారు.

తాళ్ళపూడి: తాడేపల్లిగూడెంలో జరిగే బహిరంగ సభకు తాళ్ళపూడి మండలం నుంచి టీడీపీ, జనసేన శ్రేణులు భారీగా తరలివెళ్లారు. వేగేశ్వ రపురం నుంచి టీడీపీ నాయకులు కైగాల శ్రీనివాస్, జనసేన మండ లాధ్యక్షుడు గంటా కృష్ణ ఆధ్వర్యంలో పలు గ్రామాల నాయకులతో కలిసి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. పెద్దేవం గ్రామం నుంచి తిగిరిపల్లి గోపి ఆధ్వర్యంలో టీడీపీ యువ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా బయలుదేరి వెళ్లారు. అందరి నోటా టీడీపీ, జనసేన కూటమిలో కొత్త ప్రభుత్వం సాధించడమే లక్ష్యం అనే నినాదాలతో బయలుదేరారు.



నల్లజర్ల నుంచి తాడేపల్లిగూడెం సభకు తరలివెళుతున్న టీడీపీ, జనసేన నాయకులు



దేవరపల్లి : సభకు వెళుతున్న జనసేన గోపాలపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్, జనసేన నేతలు

గోపాలపురం: తాడేపల్లిగూడెం శివారు ప్రత్తిపాడు సమీపంలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో బుధవారం జరుగుతున్న విజయకేతన బహిరంగ సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నాయకులు తరలివెళ్లారు.

దేవరపల్లి: తాడేపల్లిగూడెంలో జరిగే భారీ బహిరంగ సభకు గోపాలపురం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ సువర్ణరాజు ఆధ్వర్యంలో తరలివెళ్ళారు. దేవరపల్లిలో జెండా ఊపి ర్యాలీని సువర్ణరాజు ప్రారంభించారు. మండ లంలోని టీడీపీ, జనసేన నేతలు కారుల్లోనూ, మోటర్‌సైకిళ్లపై తరలివెళ్లారు. కార్యక్రమంలో జనసేన నాయకులు కంబాల సత్తిబాబు, సూరిశెట్టి బాలు, తోలుమాటి నాని, అడబాల మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: తాడేపల్లిగూడెంలో జరిగే టీడీపీ, జనసేన సభకు మండలంలోని ఆయా గ్రామాల నుంచి ఇరు పార్టీల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మండలపార్టీ అధ్యక్షుడు అతికాల రామకృష్ణమ్మ ఖండవల్లి నుంచి, పెరవలి నుంచి సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు, తీపర్రు నుంచి కంటిపడి సూర్యనారాయణ ఆధ్వర్యంలోనూ కానూరు అగ్రహా రం నుంచిహనుమంతు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ కానూరు, నడిపల్లి, అజ్జరం, కాకరపర్రు, నల్లాకులవారిపాలెం, కొత్తపల్లి, ముక్కామల, అన్నవరప్పాడు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. టీడీపీ నాయకుడు కుందుల వీరవెంకట సత్యనారాయణ ఆధ్వ ర్యంలో తాడేపల్లిగూడెంలో జరిగిన టీడీపీ, జనసేన బహిరంగసభకు తీపర్రు నుంచి తరలివెళ్లారు.

బహిరంగ సభ విజయవంతం చేయాలి

ఉండ్రాజవరం: బుధవారం తాడేపల్లిగూడెంలో జరిగే బహిరంగసభకు భారీ ర్యాలీకి వేలివెన్నులో శేషారావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు చంద్రబాబు ముఖ్యమంత్రిని చేసేందుకు కృషి చేయాలన్నారు. శేషారావు ర్యాలీలో తాను కూడా బైక్‌పై వెళ్లారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని టీడీపీ, జనసేన నా యకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని తాడేపల్లిగూడెం తరలివెళ్లారు.



వేలివెన్నులో జెండా ఊపి భారీ ర్యాలీని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

మానవాళిని చీకటి నుంచి వెలుగులోకి నడిపించేది సైన్స్

● నన్నయ వీసీ పద్మరాజు
● పలు పాఠశాలల్లో జాతీయ వైజ్ఞానిక దినోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న వీసీ పద్మరాజు

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 28: మానవాళిని చీకటి నుంచి వెలుగులోకి నడిపించేది సైన్స్ అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు అన్నారు. విశ్వవిద్యాలయంలో బుధవారం జాతీయసైన్స్ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. వికసితభారత్ కోసం స్వదేశీ సాంకేతికత అనే అంశంతో నిర్వహించిన ఈకార్యక్రమంలో వీసీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత నన్నయ విగ్రహానికి, సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సీవీ రామన్ వంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సైన్స్‌కు సంబంధించి నూతన కోర్సులను విశ్వవిద్యాలయంలో ప్రారంభిస్తున్నామన్నారు. నన్నయ విద్యార్థులు సైన్స్‌లో నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. విశిష్టఅతిథిగా హాజరైన మినిస్ట్రీ ఆఫ్ ఎర్త్‌సైన్సస్ ప్రాజెక్ట్ అప్రైజల్, మానిటరింగ్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ వై.వి.ఎస్.కృష్ణమూర్తి మాట్లాడుతూ మానవసంబంధాలు, ఆర్థికసం బంధాలు శాస్త్రసాంకేతిక రంగాలతో ఆధారపడి ఉన్నాయని గుర్తుచేశారు. ఆచార్య జి.మురళీకృష్ణ, డాక్టర్ కె.నూకరత్నం రచించిన పైథన్ ప్రోగ్రామింగ్ ఫర్ జియోగ్రాఫిక్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ (జి.ఐ.ఎస్) పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ బి.జగన్మోహనరెడ్డి, డీన్ వై.శ్రీనివాసరావు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపిన రామన్

కొవ్వూరు: సీవీ రామన్ 1928లో రామన్ ప్రభావాన్ని కనుగొని ప్రపంచంలో భారతదేశాన్ని భౌతికశాస్త్రంలో అగ్రగామి గా నిలిపారని కొవ్వూరు ఏబీఎన్, పీఆర్ఆర్ డిగ్రీ కలాశాల ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు అన్నారు. కొవ్వూరు అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ, వీజీ కళాశాలలో బుధవారం జాతీయ సైన్సు దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ నందిగం వెంకట సుబ్బారావు మాట్లాడుతూ రామన్ ప్రభావాన్ని కనుగొన్న ఫిబ్రవరి 28వ తేదీని అప్పటినుంచి దేశవ్యాప్తంగా జాతీయ సైన్సు దినోత్సవాన్ని జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, నానో ఫిజిక్స్, అనువర్తనములు, కేంద్రక భౌతిక శాస్త్రం, భౌతికశాస్త్రంలో నోబెల్ గ్రహీతలు, ఇంద్రధనస్సు ఎలా ఏర్పడుతుంది అనే అంశాలను వివరించారు. అనంతరం క్విజ్, పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎ.శ్రీనివాసు, బి.సత్యనారాయణ, ఎం. అనూషాదేవి, డీఎస్ఎస్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు. కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ జె. సునీత ఆధ్వర్యంలో బుధవారం జాతీయ సైన్సు దినోత్సవాన్ని నిర్వహించారు. కొవ్వూరు మండలం ధర్మవరం స్వర్ణభారతి పాఠశాలలో పేరిచర్ల రామకృష్ణరాజు ఆధ్వర్యంలోను, కొవ్వూరు డా.సర్వేపల్లి రాధాకష్ణ హైస్కూల్‌లో అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర ఆధ్వర్యంలో సర్ సీవీ రామన్ జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ సైన్సు దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



కొవ్వూరులో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న వెంకట సుబ్బారావు

తాళ్ళపూడి: మండలంలో పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో బుధవారం సైన్స్ డే ఘనంగా నిర్వహించారు. బల్లిపాడు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు డీవీకే రాజు మాట్లాడుతూ సైన్సును చివరి శ్వాసవరకూ ఆరాధిస్తాను అని అన్న సీవీ రామన్ మాటలు పట్టుదల ప్రతి విద్యార్థి గుర్తించుకోవాలని తెలిపారు. సైన్స్ డే సందర్భంగా ఒక విద్యార్థికి సి వి రామన్ వేషధారణవేసి పలు ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో సహా ఉపాధ్యాయులు వరలక్ష్మి, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ప్రక్కిలంక స్పెషల్ స్కూల్‌లో సైన్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుడు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు.

గోపాలపురం: గణిత శాస్త్రవేత్త సీవీ రామన్ జయంతిని స్థానిక గురుకుల పాఠశాలలో బుధవారం ఘనంగా జరుపుకు న్నారు. ఈ సందర్భంగా సైన్స్‌డే నిర్వహించారు. అనంతరం సీవీ రామన్ చిత్రపటానికి పూలమాలలువేసి రామన్ ఎఫెక్ట్ గురించి వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులు ప్రదర్శించారు. ప్రిన్సిపల్ ఉమాదేవి మాట్లాడుతూ సాంకేతికంగా ప్రతీ విద్యార్థి సైన్స్‌పట్ల అవగాహన కలిగి ఉండా లన్నారు. ప్రతీ విద్యార్థి వైజ్ఞానిక ప్రదర్శన పట్ల ఆసక్తి చూపాలని ఆయా రంగాల్లో విద్యార్థులు రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. గణిత పితా మహుడు సీవీ రామన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని శాస్త్రవేత్తగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, సీఆర్‌పీ నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

నల్లజర్ల: నేషనల్ సైన్సు డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం నల్లజర్ల సెయింట్ జోషప్ స్కూల్‌లో విద్యార్థులు రూపొందించిన సైన్సు ఈవేంట్స్ ప్రదర్శనను ఎంఈవో సత్యనారాయణ పరిశీలించారు. స్కూల్ డైరెక్టర్ మేణ్ని జానికీ దేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నల్లజర్ల హైస్కూల్,సెయింట్ క్లారెట్స్ స్కూల్స్‌లో సైతం సైన్సు డే ప్రదర్శనలు జరిగాయి.

దేవరపల్లి: దేవరపల్లిలో జాతీయ సైన్స్‌డే సందర్భంగా భాష్యం, సత్యసాయి స్కూల్‌లో విద్యార్థులు వైజ్ఞానిక ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలో సెన్సార్ సోలార్ ఎనర్జీ, బయోగ్యాస్, చంద్రయాన్, రాకెట్ మోడల్స్ ఆటోమేటిక్ వాటర్ పంపు పలు ప్రాజెక్టులు అలరించాయి. కార్యక్రమాల్లో సత్యసాయి స్కూల్ ప్రిన్సిపల్ సత్యరాజు వేణు గోపాలరావు, పేరయ్య నాయుడు, చామ్స్ ప్రిన్సిపల్ సభాన, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

కొవ్వూరు, ఫిబ్రవరి 28 : మార్చి 9వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను మార్చి 16వ తేదీకి మార్పుచేసినట్లు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, కొవ్వూరు 9వ అదనపు జిల్లా జడ్జి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను 16వ తేదీ నాటికి మార్పుచేస్తూ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. న్యాయవాదులు, అధికారులు, కక్షిదారులు గమనించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

కొవ్వూరు, ఫిబ్రవరి 28 : ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోరుతూ ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం సాయంత్రం 4 గంటల నుంచి 5-30 వరకు ధర్నా నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సువర్ణరాజు తెలిపారు. ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందించారు. పాత బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఐ.ఆర్. ప్రకటించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్యకర్తలపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, 117జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఉపాధ్యాయులు, అధికసంఖ్యలో పాల్గొనాలన్నారు.

క్వారీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

దేవరపల్లి, ఫిబ్రవరి 28: మండలంలోని గౌరీపట్నం, దుద్దుకూరు ప్రాంతాల్లో క్వారీ క్లషర్ల వద్ద మెటల్ లోడింగ్ చేసే ట్రాక్టర్లపై పని చేస్తున్న కార్మికులకు నూతన వేతన ఒప్పందం ప్రకారం జీతాలు చెల్లించాలని వివిధ కార్మిక సంఘం నాయకులు ఎస్‌కే.మస్తాన్, కార్తీక్ రాజు, సుబ్రహ్మణ్యం, డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మస్తాన్ మాట్లాడుతూ క్వారీకార్మికుల సమస్యలు పరిష్కరించాలని క్వారీక్లషర్ల యాజమానులు యాగంటి సత్తిరాజు, డీ.రామకృష్ణరాజులకు 14డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

ప్రభుత్వాసుపత్రికి ఫ్రిజ్ బహూకరణ

కొవ్వూరు, ఫిబ్రవరి 28: కొవ్వూరు మండలం దొమ్మేరు ప్రభుత్వ ఆసుపత్రికి లయన్స్ క్లబ్ సభ్యులు ఫ్రిజ్ బహూకరించారు. కొవ్వూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం లయన్స్ జిల్లా గవర్నర్ వార్షిక పర్యటన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొవ్వూరుకు చెందిన మద్దిపట్ల మురళీకృష్ణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కలగర వెంకట్రావులు దొమ్మేరు ప్రభుత్వ ఆసుపత్రికి రూ.20 వేల విలువైన ఫ్రిజ్‌ను బహూకరించారు. జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు గర్భిణులకు చీరలు, సత్య స్వరూ, పాలింపాటి చిన్నబాబులు పౌష్టికాహారం, గుడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి రవికుమార్, కోడి శ్రీనివాస్, పెనుమాక జయరాజు, ఉప్పులూరి రామకృష్ణ, పరిమి హరిచరణ్, కంటమణి కిషోర్, మద్దిపాటి సత్యనారాయణ, యనమదల సుబ్రహ్మణ్యం, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, మన్యం బుల్లిబాబు, హౌస్సేన్, ఆసుపత్రి వైద్యులు ఎస్. ధర్మరాజు పాల్గొన్నారు.

'అమర్‌కు రాజమహేంద్రవరం ఎంపీ సీటు కేటాయించాలి'

కొవ్వూరు, ఫిబ్రవరి 28: రాజమహేంద్రవరం పార్లమెంటు కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిత్వాన్ని కేటాయించాలని అమర్‌జహా బేగ్ మహ్మద్ దరఖాస్తు చేశారు. బుధవారం విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఆంధ్రరత్న భవన్‌లో కొవ్వూరు మండలం కాపవరం గ్రామానికి చెందిన అమర్‌జహా బేగ్ మహ్మద్ రాజమహేంద్రవరం పార్లమెంటు స్థానానికి కొవ్వూరు నియోజకవర్గ అభ్యర్థిత్వానికి వేములూరు గ్రామానికి చెందిన సాకా పుల్లారావులు దరఖాస్తులు అందజేశామన్నారు. కార్యక్రమంలో మట్టా సుబ్బారావు ఉన్నారు.

'మాలలకు కొవ్వూరు టీడీపీ టిక్కెట్ కేటాయించాలి'

కొవ్వూరు, ఫిబ్రవరి 28 : రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన మాలలకు తెలుగు దేశంపార్టీ కొవ్వూరు టిక్కెట్టును కేటాయించాలని దళిత నాయకులు డిమాండ్ చేశారు. కొవ్వూరు పట్టణంలోని మెరకవీధి 4వ వార్డు అంబేడ్కర్ విగ్రహం వద్ద బుధవారం నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ ఎస్సీలలో అధిక జనాభా కలిగిన మాలలను అన్ని రాజకీయపార్టీలు ఓటు బ్యాంకుగానే పరిగణిస్తున్నాయన్నారు. కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గంలో 2004 నుంచి 2019 వరకు మూడుసార్లు టీడీపీ టిక్కెట్టు మాదిగ సామాజికవర్గానికి కేటాయించారు. 2024 అసెంబ్లీ ఎన్నికలలో టీడీపీ తరఫున మాల సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పి.ఉదయబాస్కర్, సిహెచ్. చిట్టిరాజు, ఎ. శ్రీనివాస్, బి. లక్ష్మణ్, ఎన్. సురేష్, పి.సునీల్‌కుమార్, జి. చెన్న్య, పి. రాజా, పి. డేవిడ్‌రాజు, టి. ఇస్రాయేలు, కె. ప్రవీణ్, పి. వంశీకృష్ణ, ఎన్. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

3న మల్లేశ్వరంలో మహా కుంభాభిషేకం

పెరవలి, ఫిబ్రవరి 28: మల్లేశ్వరంలో ఉన్న కపిల మల్లేశ్వర స్వామికి మహా కుంభాభిషేకం మార్చి1 నుంచి 3 వరకు మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు హోమాలు జరుగుతాయని 3వతేదీన మహా కుంభాభిషేకం జరుగుతుందని ఆలయ కమిటీ వారు తెలిపారు. పూజా కార్యక్రమాలు అనంతరం భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేశామని తెలిపారు.

బాబూ రాజేంద్ర ప్రసాద్ వర్ధంతి

తాళ్ళపూడి, ఫిబ్రవరి 28 : మండలం రాగోలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం డాక్టర్ బాబూరాజేంద్రప్రసాద్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

'నాయకులకన్నా అధికారులే శాశ్వతం'

కొవ్వూరు, ఫిబ్రవరి 28 : నాయకులు, ప్రభుత్వాలు మారుతుంటాయి కానీ అధికారులు శాశ్వతమని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. కొవ్వూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలస్థాయి అధికారులతో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సమీక్షా సమావేశం నిర్వహించారు. తలారి వెంకట్రావు మాట్లాడుతూ నాయకుల పదవీ కాలం 5 సంవత్సరాలు. అధికారులు 32 సంవత్సరాలపాటు ప్రజలకు సేవలు అందిస్తారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె. సుశీల, ఎలక్ట్రికల్ ఏడిఏ పి. అచ్యుతాచారి, వైస్ ఎంపిపి వీరమళ్ల నారాయుడు, బండి పట్టాభిరామారావు, తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	సిద్ధార్థ్‌రాయ్
వై.స్క్రీన్ 2	ఈగల్
దేవిశ్రీ(గాయత్రి)	హనుమాన్
అనన్య	ఊరి పేరు భైరవ కోన

నిడదవోలు

వీ మ్యాక్స్	ఊరి పేరు భైరవ కోన
రాధాకృష్ణ	సిద్ధార్థ్‌రాయ్
శ్రీగణపతి	వ్యూహం

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం
శ్రీరామ్ సినీ మ్యాక్స్	గుంటూరు కారం

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్	సలార్
శ్రీనివాస	సలార్